TGTEL/25/A0880

# నమస్తే భారత్

తెలుగు దినపత్రిక

NAMASTHE BHARAT TELUGU DAILY

న్యాయమిత్ర న్యూస్ దినపత్రిక
నమస్తే భారత్ తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY

మన సమాజంలో జరుగుతున్న న్యాయపరమైన, చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై సందేహాలు మరియు పరిష్కారం కొరకు ఒక నిబద్ధతతో కూడిన సంబంధిత సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయనిపుణుల సహకారంతో పరిష్కార వేదికగా నమస్తే భారత్ మరియు న్యాయమిత్ర వేదికగా నిలుస్తుంది.. అలాగే ప్రభుత్వ విభాగంలో నేలకొనియున్న అన్ని సమస్యలకు పరిష్కార మార్గం చూపుతుంది. మీకు మరియు మీ చుట్టు పక్కల వారి హక్కుల ఉల్లంఘనను, మీకు జరిగిన అన్యాయం గురించి ఫిర్యాదులను మరియు వాటికీ సంబందిచిన సమాచారని, సాక్షాలతో మాకు తెలియపరచగలరు.. ..ఎడిటర్ డెస్క్ 94916 23567

మల్కాజిగిరి | సంపుటి : 01 | సంచిక : 13 | ఎడిటర్ : కందాడి మహేందర్ రెడ్డి | ఆదివారం, జూన్,14, 2026 | పేజీలు : 8 | వెల : రూ.4/-



యుద్ధాన్ని ముగించే
## సమయం వచ్చేసింది

- ఇరాన్‌తో ఒప్పందం కొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశం
- నెతన్యాహుకు ట్రంప్ ఫోన్‌లో స్పష్టమైన సందేశం

**ఇంటర్నెట్ న్యూస్, జూన్13**

ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశముందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. "చారిత్రక ఒప్పందంపై రేపు సంతకాలు జరగనున్నాయి. ఆ వెంటనే హర్మూజ్ జలసంధి అందరి కోసం తెరుచుకుంటుంది" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. గతంలో ఒబామా హయాంలో జరిగిన ఒప్పందంలా కాకుండా, ఈ డీల్ కింద ఇరాన్‌కు ఎలాంటి నగదు చెల్లింపులు లేవని, అణ్వాయుధాలు తయారు చేయకుండా ఇది బలమైన అడ్డంకిగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ ఉద్యమంలో రేవంత్
## ఒక్కనాడైనా పాల్గొన్నారా?

### అడ్డగోలు హామీలిచ్చి రేవంత్ రెడ్డి గద్దెనెక్కారు

- ఉమ్మడి పాలనలో తెలంగాణ అంటే నాయకులకు గౌరవం ఉండేది కాదు
- రెండే ప్రాంతీయ పార్టీలు విజయవంతంగా నిలబడ్డాయి
- కష్టపడి తెలంగాణ తెచ్చింది కేసీఆర్
- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నాయి
- వానపాములు కూడా నాగుపాములై బుస కొడుతున్నాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**వేములవాడ: జూన్13,**

ఉమ్మడి పాలనలో తెలంగాణ అంటే నాయకులకు గౌరవం ఉండేది కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్( స్పష్టం చేశారు. కేసీఆర్)ను టీడీపీలోకి తీసుకుంటే బాగుంటుందని భాగ్యరెడ్డి చెప్పారని రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పేర్కొన్నారు. రెండే ప్రాంతీయ పార్టీలు విజయవంతంగా నిలబడ్డాయని సూచించారు. టీడీపీ, బీఆర్ఎస్ మాత్రమే మిగిలాయని కేటీఆర్ వివరించారు. కష్టపడి తెలంగాణ తెచ్చింది కేసీఆర్ అని గుర్తుచేశారు.కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు ఇబ్బందుల్లో ఉన్నాయని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఉద్యమంలో రేవంత్ రెడ్డి( ఒక్కనాడైనా పాల్గొన్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. వానపాములు కూడా నాగుపాములై బుస కొడుతున్నాయని తెలిపారు. తెలంగాణ తానే సాధించినట్లు రేవంత్ మాట్లాడుతున్నారని చురకలంటించారు. ఎవని పాలయ్యింది తెలంగాణ అని పాట) పాడుకునే దుస్థితి వచ్చిందన్నారు. కేసీఆర్ పాలన బాగుండేదని ప్రజలు అనుకుంటున్నారని కేటీఆర్ జోస్యం చెప్పారు. అడ్డగోలు హామీలిచ్చి రేవంత్ రెడ్డి గద్దెనెక్కారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. అభయహస్తం పేరుతో కాంగ్రెస్ ఇచ్చిన మేనిఫెస్టో దాశాబ్దపు అబద్ధం అన్నారు. తెలంగాణలో జూన్ 25 నుండి ూ×=ను తీసుకొస్తున్నారు. రాష్ట్ర ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ కోరారు. ఎస్ఐఆర్ జరిగిన ప్రాంతాల్లో భారతీయ జనతా పార్టీ వాళ్లకు పడవన్న ఓట్లు అన్ని తొలగించారని కేటీఆర్ ఆరోపించారు.



ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తే సింధు నీళ్లు
## అందకుండా చేస్తాం

- మీరు అలా చేస్తే సింధు నీళ్లు రావు.. పాకిస్థాన్‌కు రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్!
- పహల్గాం దాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసినట్లు వెల్లడి
- రక్తం, నీళ్లు కలిసి ప్రవహించవన్న ప్రధాని మోదీ మాటలను గుర్తు చేసిన రక్షణ మంత్రి
- ఆర్టికల్ 370 రద్దు తర్వాత కశ్మీర్‌లో పర్యాటకం, పెట్టుబడులు పెరిగాయని వ్యాఖ్య

**న్యూఢిల్లీ,జూన్13,**

ఉగ్రవాదానికి మద్దతు ఇస్తున్న పాకిస్థాన్‌పై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే వారికి సింధు నది జలాలు అందకుండా చేస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు. హైదరాబాద్‌లో తెలంగాణ బీజేపీ శాఖ నిర్వహించిన 'మేధావుల సదస్సు'లో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. శాంతి, సామరస్య భాష అర్థం చేసుకోని వారికి ఎలా బదులివ్వాలో 'ఆపరేషన్ సిందూర్' ద్వారా తమ ప్రభుత్వం ప్రపంచానికి చాటిచెప్పిందని ఆయన అన్నారు.పహల్గాం ఉగ్రదాడి ఘటనను ప్రస్తావిస్తూ.. "ఉగ్రవాదుల దుశ్చర్యల పట్ల కన్నీళ్లు రానివారు, మా నుంచి నీళ్లు ఆశించవద్దు. మానవత్వ శత్రువులకు, ఉగ్రవాద సానుభూతిపరులకు సింధు నది జలాలను చేరనివ్వబోం" అని రాజ్‌నాథ్ స్పష్టం చేశారు. గతంలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'రక్తం, నీళ్లు కలిసి ప్రవహించవు' అనే వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. సరిహద్దు ఉగ్రవాదానికి పాకిస్థాన్ మద్దతును శాశ్వతంగా విరమించుకునే వరకు ఈ ఒప్పందంపై తమ వైఖరి మారదని ఆయన స్పష్టం చేశారు.

ఏపీ లిక్కర్
## రవాణా కుంభకోణం

- ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు రాజశేఖర్ రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ అరెస్ట్
- హైదరాబాద్‌లో సోదాలు, రూ.94.5 లక్షల విలువైన వాచీలు, నగదు స్వాధీనం
- ప్రభుత్వానికి రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు నిర్ధారణ
- నిందితులకు ఈ నెల 25 వరకు జ్యుడీషియల్ కస్టడీ




**అమరావతి,జూన్14,**

ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణానికి అనుబంధంగా జరిగిన మద్యం రవాణా టెండర్ల స్కామ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును వేగవంతం చేసింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారులు హైదరాబాద్‌లోని ఐదు ప్రాంతాల్లో చేపట్టిన సోదాల్లో కీలక ఆధారాలు లభించాయి. గురువారం నిర్వహించిన ఈ దాడుల్లో ఒక లగ్జరీ కారుతో పాటు రూ. 94.5 లక్షల విలువైన ఖరీదైన గడియారాలు, లెక్కల్లో చూపని నగదును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

అంగన్వాడీల సంక్షేమమే
## మా ప్రాధాన్యత

- స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిన అంగన్వాడీలకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్!
- వారి స్థానంలో కొత్త నియామకాలు జరగకపోతే తిరిగి విధుల్లోకి అవకాశం
- వేలాది మంది కార్యకర్తలు, సహాయకులకు లభించిన భరోసా
- మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్,జూన్13**

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమ పదవులకు రాజీనామా సమర్పించి, ఎన్నికల్లో ఓటమి చెందిన అంగన్వాడీ టీచర్లు, సహాయకులకు తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సదరు పోస్టుల్లో ఇప్పటి వరకు కొత్త నియామకాలు జరగని పక్షంలో, వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు జూన్ 13న అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## కోవర్టల సంగతి తేలుస్తాం

- మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ
- ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత
- అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్




**హైదరాబాద్,జూన్13,**

మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో
## కీలక పరిణామం

- తుమ్మల ఫోన్ కాల్స్, లొకేషన్ డేటా వివరాలు సేకరించిన సిట్

### తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్టు ప్రాథమిక విచారణలో గుర్తింపు

**హైదరాబాద్,జూన్13,**

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసును విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఈరోజు రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయన వాంగ్మూలాన్ని అధికారికంగా నమోదు చేసింది. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్ జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సిట్ విస్తృత స్థాయిలో దర్యాప్తు చేపడుతోంది. ప్రాథమిక విచారణలో అప్పట్లో



ఖమ్మం రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన తుమ్మల నాగేశ్వరరావు కూడా ట్యాపింగ్‌కు గురైన వారిలో ఒకరని గుర్తించినట్లు సమాచారం.

## హైడ్రా కమిషనర్‌కు హైకోర్టు షాక్..!

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు రూ.50 వేల జరిమానా
- కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు హైకోర్టు ఆగ్రహం
- యూసఫ్‌గూడ భూవివాదంలో యథాతథస్థితి ఉల్లంఘన

**హైదరాబాద్,జూన్13**

భూవివాదానికి సంబంధించిన కేసులో కోర్టు ఉత్తర్వులను ధిక్కరించినందుకు 'హైడ్రా' కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. ఆయనకు రూ. 50 వేల జరిమానా విధిస్తూ జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం కీలక ఉత్తర్వులు జారీ చేశారు. కోర్టు ధిక్కరణ కింద ఈ చర్యలు తీసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ మండలం, యూసఫ్‌గూడ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 45లో ఉన్న రెండెకరాల భూవివాదంపై మహ్మద్ షఫాహతుల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో



న్యాయస్థానం యథాతథస్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే, ఈ ఆదేశాలను ఉల్లంఘించి అధికారులు ప్రహరీ గోడ కూల్చివేసి, కంచె ఏర్పాటు చేశారని పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

# ప్రపంచ రక్తదాతల దినోత్సవం -- 2026"ఒక చుక్క మానవత్వం -- రక్తదానం చేయండి, ప్రాణాలను కాపాడండి"




రచన: మధుబాబు చికిలే
స్కిలోక్రాట్,జాతీయ డైరెక్టర్,
వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్

ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం జరుపుకుంటారు. ప్రాణాలను రక్షించడానికి స్వచ్ఛందంగా రక్తదానం చేసే లక్షలాది మంది రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేయడం, రక్తదానంపై అవగాహన పెంపొందించడం, కొత్త రక్తదాతలను ప్రోత్సహించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యం. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడుతోంది. 2026 ప్రపంచ రక్తదాతల దినోత్సవ అంశం "ఒక చుక్క మానవత్వం -- రక్తదానం చేయండి, ప్రాణాలను కాపాడండి."ఈ సంవత్సరం అంశం మానవత్వం, కరుణ, సహానుభూతి మరియు సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తుంది. ఒక చుక్క రక్తం కేవలం వైద్య సహాయం మాత్రమే కాదు, అది ఒక మనిషి మరో మనిషికి అందించే జీవన వరం అనే సందేశాన్ని ప్రపంచానికి అందిస్తోంది. రక్తదానం ఎందుకు ముఖ్యము?రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. రక్తాన్ని కేవలం మరో మనిషి మాత్రమే దానం చేయగలడు. ప్రమాదాలు, శస్త్రచికిత్సలు, ప్రసవ సమయ అత్యవసర పరిస్థితులు, క్యాన్సర్ చికిత్సలు, థలసేమియా వంటి వ్యాధులతో బాధపడుతున్న రోగులకు రక్తం అత్యవసరం. రక్తం లేకపోతే అనేక ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. ఒక్కసారి రక్తదానం చేయడం ద్వారా మూడు మంది వరకు ప్రాణాలను కాపాడే అవకాశం ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు. అందుకే ప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిస్తోంది. ?కరోనా తరువాత ఏర్పడిన సవాళ్లుకోవిడ్-19 మహమ్మారి తరువాత ప్రపంచవ్యాప్తంగా రక్తదాతల సంఖ్యలో తగ్గుదల కనిపిస్తోంది. కరోనా సమయంలో ప్రజల్లో ఏర్పడిన భయాలు, ఆరోగ్య ఆందోళనలు, జీవనశైలిలో వచ్చిన మార్పులు, స్వచ్ఛంద సేవా కార్యక్రమాల తగ్గుదల వంటి కారణాల వల్ల రక్త నిల్వలు అనేక ప్రాంతాల్లో తగ్గిపోయాయి.ప్రస్తుతం అనేక రక్త బ్యాంకులు తగినంత రక్త నిల్వలను సమకూర్చుకోవడానికి కష్టపడుతున్నాయి. అందువల్ల యువత, విద్యార్థులు, ఉద్యోగులు, సామాజిక సంస్థలు మరింత బాధ్యతతో ముందుకు వచ్చి రక్తదాన ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉ ంది. రక్తదానం -- మానవత్వానికి ప్రతీకరక్తదానం కులం, మతం, భాష, ప్రాంతం అనే భేదాలకు అతీతమైన సేవ. ఒక రక్తదాత ఎవరికో తెలియని వ్యక్తికి జీవితం అందిస్తాడు. అదే నిజమైన మానవత్వం. సమాజంలో పరస్పర సహకారం, దయ, బాధ్యతా భావాన్ని పెంపొందించే గొప్ప సేవా కార్యక్రమం రక్తదానం.నా వ్యక్తిగత అనుభవం, ఏడవ నెలలో కామెర్లతో పుట్టిన నేను ఈ రోజు ఆరోగ్యావంతంగా రక్తదానం చేస్తున్నాను.నాకు రక్తదానం అనేది కేవలం సేవా కార్యక్రమం మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత. ఇప్పటి వరకు నేను 86 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం నా జీవితంలో అత్యంత గర్వకారణమైన విషయం.ప్రతి రక్తదానం వెనుక ఒక ప్రాణం ఉంటుంది. ఒక తల్లి, ఒక చిన్నారి, ఒక ప్రమాద బాధితుడు, ఒక రోగి -- ఎవరికో ఒకరికి మన రక్తం జీవనాధారం అవుతుంది. నేను చేసిన ప్రతి రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడే అవకాశం లభించిందని భావించడం నాకు అపారమైన సంతృప్తిని ఇస్తుంది.ఈ సందర్భంగా దేశంలోని యువతకు, విద్యార్థులకు, సామాజిక కార్యకర్తలకు నా విజ్ఞప్తి -- "రక్తదానం చేయండి. ప్రాణాలను కాపాడండి. మానవత్వాన్ని నిలబెట్టండి."యువతకు పిలుపుప్రతి ఆరోగ్యవంతుడు క్రమం తప్పకుండా రక్తదానం చేయాలి.రక్తదానంపై ఉన్న అపోహలను తొలగించాలి.

కళాశాలలు, సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు రక్తదాన శిబిరాలు నిర్వహించాలి.కొత్త రక్తదాతలను ప్రోత్సహించాలి.రక్తదానం గురించి కుటుంబ సభ్యులకు, స్నేహితులకు అవగాహన కల్పించాలి.ముగింపుప్రపంచ రక్తదాతల దినోత్సవం కేవలం ఒక రోజు కాదు; అది మానవత్వాన్ని గుర్తుచేసే ఒక ఉద్యమం. మనం ఇచ్చే ఒక్క యూనిట్ రక్తం ఎవరికో ఒకరికి కొత్త జీవితాన్ని అందించవచ్చు. అందుకే ఈ 2026 ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా మనమందరం ఒక సంకల్పం చేద్దాం -- ఈ సందర్భంగా లక్ష మందితో రక్త దానం కొరకు ప్రతిజ్ఞ చేయుంచే "భారత్ కోసం రక్త దానం "అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నాం. ప్రతి కళాశాల లో ప్రతి మహిళా సంఘాలతో, యువతతో ఈ ప్రతిజ్ఞ చేయించి రక్త దాన మహోద్యమాన్ని ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా మొదలు పెడుతున్నాము."రక్తదానం చేద్దాం... ప్రాణాలను కాపాడుదాం... మానవత్వాన్ని నిలబెట్టుదాం."జై హింద్! :::

# రైతుల ముంగిటకు 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'

## - ఎరువుల పంపిణీలో పారదర్శకతే లక్ష్యం
## - వ్యవసాయ శాఖ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్
## - షాద్‌నగర్ లో ఎరువుల దుకాణాల తనిఖీ
## - వ్యవసాయ శాఖతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష ఎఫెక్ట్




**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్13:**రైతులు ఎరువుల కోసం ఎదుర్కొంటున్న ఇబ్బందులను, క్షేత్రస్థాయిలో జరుగుతున్న అక్రమాలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్'ను తీసుకువచ్చిందని రాష్ట్ర వ్యవసాయ కమిషనరేట్ అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి రాఘవేంద్ర ఫర్టిలైజర్ తదితర షాపులను ఆయన పరిశీలించి తనిఖీ చేశారు. అదేవిధంగా నందిగామ మండలంలో ఆయన వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ఈ యాప్ పనితీరును, డీలర్ షాపుల వద్ద అమలవుతున్న విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ తనిఖీ చేశారు. నిన్న వ్యవసాయ శాఖ అధికారులతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమీక్ష సందర్భంగా ప్రస్తావించిన పలు సమస్యలను గుర్తించి అధికారులు మరుసటి రోజు శనివారం రంగంలోకి దిగడం విశేషం. ఈ సందర్భంగా అదనపు డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో రైతులు ఎరువులు కొనుగోలు చేయడానికి గంటల తరబడి క్యూ లైన్లలో పడిగాపులు కాయడం, బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయించడం, బలవంతంగా ఇతర వస్తువులను అంటగట్టడం వంటి సమస్యలు అనేకం తమ దృష్టికి వచ్చాయన్నారు. వీటన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపేందుకే ఈ నూతన సాంకేతికతను అందుబాటులోకి తెచ్చినట్లు ఆయన వివరించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ ఇంటి వద్ద నుంచే సులభంగా ఎరువులను బుక్ చేసుకోవచ్చని, దీనివల్ల సమయం ఆదాతో పాటు పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రాథమికంగా ఈ విధానాన్ని పైలట్ ప్రాజెక్టుగా రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలతో సహా రాష్ట్రంలోని ఐదు జిల్లాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక సమస్యలకు తక్షణ పరిష్కారాలు యాప్ అమలులో వస్తున్న సాంకేతిక సమస్యలను ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నట్లు విజయ్ కుమార్ తెలిపారు.ఓటీపీ విధానం కొనుగోలు సమయంలో కొందరు రైతుల వేలిముద్రలు పడక తలెత్తుతున్న ఇబ్బందులను గమనించి, వెంటనే కేంద్రం దృష్టికి తీసుకెళ్లామని, దీంతో వేలిముద్రల స్థానంలో ఓటీపీ ద్వారా ఎరువులు కొనుగోలు చేసే సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామని వివరించారు.అదే రోజు కొనుగోలు:గతంలో యాప్‌లో ఎరువులు బుక్ చేసుకున్న రెండు రోజుల తర్వాత కొనుగోలు చేయాలన్న నిబంధన ఉ ండేది. కానీ, రైతుల విజ్ఞప్తి మేరకు ఇప్పుడు బుక్ చేసుకున్న రోజే ఎరువులు పొందే వెసులుబాటు కల్పించినట్లు ఆయన స్పష్టం చేశారు.కంట్రోల్ రూమ్ ఏర్పాటుయాప్‌లో స్టాక్ కనిపించకపోవడం, వ్యవసాయ విస్తీర్ణం (హెక్టార్లు/ఎకరాలు) నమోదులో వస్తున్న వ్యత్యాసాలు వంటి లోపాలను పరిష్కరించేందుకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ నిరంతరం పనిచేస్తోందని, డీలర్లు లేదా రైతుల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. గ్రామానికో ముగ్గురు వాలంటీర్లు రైతులకు సేవలు అందించేందుకు ప్రతి గ్రామానికి ముగ్గురు 'సాయిల్ హెల్త్ వాలంటీర్ల'ను ప్రభుత్వం నియమించిందని విజయ్ కుమార్ తెలిపారు. వీరు గ్రామాల్లో మట్టి నమూనాలను పరీక్షించి తగిన ఎరువుల వాడకంపై రైతులకు సూచనలు ఇస్తారని, అలాగే స్మార్ట్‌ఫోన్ లేని రైతులకు లేదా యాప్ వాడకం తెలియని వారికి ఎరువులు బుక్ చేయడంలో ఉచితంగా సహాయపడతారని వివరించారు. పూర్తి స్థాయిలో ఈ యాప్ అందుబాటులోకి వస్తే ఎరువుల కొనుగోలు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారిణి శైలజ, వ్యవసాయ శాఖ ఏడీఎస్‌లు సత్యం బాబు, మాధవి, షాద్‌నగర్ ఏడీ రమాదేవితో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇతర ఏడీఎస్‌లు, సిబ్బంది పాల్గొన్నారు..

# 21 ఏండ్లుగా రక్తదాన చైతన్య యుద్ధంలో " స్విమ్మర్ రాజు "

## - ప్రపంచ రక్తదాతల దినోత్సవం

**నర్సంపేట జూన్ 13 ( నమస్తే భారత్ ) :** రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ వరంగల్ పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు) గత 21 సంవత్సరాలుగా రక్తదానం పై యువతకు అవగాహన కల్పిస్తూ పలుమార్లు రక్తదానం ,రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలిచాడు.వరంగల్ జిల్లా, ఖానాపురం మండలం, రాగంపేట గ్రామానికి చెందిన కన్నె కుమారస్వామి - రమనీల దంపతుల పెద్ద కుమారుడు బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు). తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖలో, వరంగల్ పోలీస్ కమిషనరేట్ లో సిటీ ఆర్మ్డ్ రిజర్వు ఏ.ఆర్ 2009 బ్యాచ్ (వరంగల్ సిటీ గార్డ్)లో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. 2005వ సంవత్సరం లో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఖానాపురం లో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుకుంటున్న రోజులలో తేదీ. 28/08/2005 రోజున ఎన్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ లో మొట్ట మొదటి సారి రక్తదానం చేయడం జరిగింది. రక్తం దొరకకుండా ఎవరు ఇబ్బంది పడొద్దు. ఎవరు కూడా రక్తం దొరకకుండా చనిపోకూడదు అనే ముఖ్య ఉద్దేశంతో " రక్తదాన చైతన్య యుద్ధంలో నేను సైతం అంటూ" నేను ఈ రక్తదాన చైతన్య కార్యక్రమాలు ప్రారంభించడం జరిగిందని కన్నె రాజు (స్విమ్మర్ రాజు) తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2005 సంవత్సరం నుండి నేను ఇప్పటి వరకు 37సార్లు (ఓ పాజిటివ్) రక్తదానం చేయడం జరిగింది. 2005 సంవత్సరం నుండి యువతకు ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా నేను 5 రాష్ట్రాలు (తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ఢిల్లీ, హర్యానా) రాష్ట్రాలలో (వాట్సప్, ఫేస్బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, ఇన్స్టాగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా) 1,00,000 మందికి పైగా యువత కు రక్తదానం పై అవగాహన కల్పించడం జరిగింది. గత 21 సంవత్సరాలుగా వివిధ అత్యవసర సమయంలో ఉన్నవారికి 18,469 మందికి, రక్తదాతల సహకారంతో ఉచితంగా రక్తాన్ని అందించడం జరిగింది. అత్యవసరం లో ఉన్న వారికోసం మరియు తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం ఇప్పటి వరకు 78 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగింది. కరోన (కోవిడ్ - 19) అత్యవసర సమయంలో ప్లాస్మాదానం పై అవగాహన కల్పించి 235 మందికి ప్లాస్మా అందించడం జరిగింది. జూన్ 14, 2026 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా 18 సంవత్సరాలు పూర్తయిన యువతి ,యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి సమాజానికి ఆదర్శంగా ఉండాలని కోరుచున్నాను. ఎవరికైనా అత్యవసర సమయంలో రక్తం అవసరం ఉన్నవారు, స్వచ్ఛందంగా రక్తదానం చేయాలనుకునేవారు వరంగల్ పోలీస్ కానిస్టేబుల్, బ్లడ్ డోనర్ అండ్ బ్లడ్ మోటివేటర్కన్నె రాజు (స్విమ్మర్ రాజు). 9490115105 సెల్ ఫోన్ నెంబర్ కు సంప్రదించగలరు. అదేవిధంగా ఈ సందర్భంగా నాకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తూ నన్ను ప్రోత్సహిస్తున్న నా యొక్క కుటుంబ సభ్యులకు, బంధుమిత్రులకు, వరంగల్ పోలీస్ శాఖకు, యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ సభ్యులకు, రక్తదాతలకు నా యొక్క ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.




# కేసీఆర్‌ను విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేతలకు లేదు

## - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తీవ్ర ఆగ్రహం
## - విప్ పదవికి తగిన బాధ్యతలు నిర్వర్తించకుండా ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్నారని ఆరోపణ
## - రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శ
## - స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజా మద్దతు స్పష్టమైందని వ్యాఖ్య
## - ప్రజాక్షేత్రంలో కేసీఆర్ నాయకత్వానికే ఆదరణ ఉందని స్పష్టం




**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ) :**తెలంగాణ రాష్ట్ర సాధకుడు, బీఆర్ఎస్ అధినేత కలవకుంట్ల చంద్రశేఖర రావు (కేసీఆర్)పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద తీవ్రంగా ఖండించారు. మీడియాతో మాట్లాడుతూ ఆది శ్రీనివాస్ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు.ప్రభుత్వ విప్‌గా అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం సాధిస్తూ శాసనసభ వ్యవహారాలను సజావుగా నడిపించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, ఆ బాధ్యతలను విస్మరించి బీఆర్ఎస్ పార్టీపై విమర్శలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. దీంతో విప్ పదవికే కళంకం తెస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో రైతులు విత్తనాలు, ఎరువుల కొరతతో పాటు పండించిన పంటలకు సరైన ధరలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివేకానంద్ అన్నారు. రైతాంగం అనేక సమస్యలతో సతమతమవుతుండగా ప్రభుత్వం వాటి పరిష్కారంపై దృష్టి పెట్టకుండా రాజకీయాలకే పరిమితమైందని విమర్శించారు .ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమయ్యారని ఆరోపించారు. రాష్ట్ర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన సమయంలో రాజకీయ పర్యటనలకు ప్రాధాన్యం ఇస్తున్నారని వ్యాఖ్యానించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తన బలాన్ని చాటుకుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ఆయన అన్నారు. అధికార దుర్వినియోగం, ధనబలం, అధికార బలం ఉన్నప్పటికీ ప్రజలు కాంగ్రెస్ వైపు లేరని పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో ఇప్పటికీ కేసీఆర్ నాయకత్వానికే ఆదరణ ఉందని వివేకానంద్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పోషించిన పాత్రను ఎవరూ విస్మరించలేరని, ఆయనపై విమర్శలు చేసే ముందు కాంగ్రెస్ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు వంటి నాయకులపై మాట్లాడేటప్పుడు కాంగ్రెస్ నేతలు తమ స్థాయిని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. ప్రజల సమస్యలపై స్పందించి ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుకోవడంపై దృష్టి పెట్టాలని ప్రభుత్వ విప్‌కు సూచించారు.అంతేకాకుండా, రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు లభిస్తుందని, రానున్న ఎన్నికల్లో పార్టీ మరింత బలంగా నిలుస్తుందని వివేకానంద్ ధీమా వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ డిపో అభివృద్ధికి ఉద్యోగులందరూ సహకరించాలి

## - ఆర్టీసీ డిపో మేనేజర్ సరస్వతి



**నర్సంపేట జులై 13 (నమస్తే భారత్ ) :**తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపోలో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డిపో మేనేజర్ మామిడాల సరస్వతి డిపో ఆవరణలో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. నర్సంపేట డిపో అభివృద్ధి, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడం మరియు డిపో ఆదాయాన్ని పెంపొందించేందుకు ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆర్టీసీ కార్మికులను ఉ ద్యోగస్తులను కోరారు. డిపో పురోగతికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యోగులకు వేసవి తాపాన్ని దృష్టిలో ఉంచుకొని మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ అమృత పాల్గొనగా, డిపో ఉద్యోగులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా12 వ మహాసభలను జయప్రదం చేయండి

## - షాద్ నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్




**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్13:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా 12వ మహాసభలు షాద్ నగర్ పట్టణంలో రేపు జూన్ 14 నిర్వహిస్తున్నట్టు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం షాద్నగర్ డివిజన్ కన్వీనర్ శ్రీను నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి వ్యవసాయ కార్మిక సంఘంలో ఆధ్వర్యంలో చేసిన పోరాటాలను విశ్లేషించుకుని భవిష్యత్తు కర్తవ్యాలను మహాసభలో రూపొందించుకుంటామని అదేవిధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామన్నారు.


# దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఘనంగా పేరేడ్ కార్యక్రమం

## -రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఆకట్టుకున్న వేడుక -బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ జీ, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు హాజరు
## -మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, నేతలతో కలిసి పాల్గొన్న రావుల శేషగిరి
## -జాతీయ భద్రత, దేశభక్తి స్ఫూర్తిని చాటిన కార్యక్రమం



**కుత్బుల్లాపూర్, జూన్ 13 (విజన్ ఆంధ్ర ):**దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ లో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పర్యటన సందర్భంగా నిర్వహించిన పేరేడ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ జి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రవు , మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ప్రముఖ నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ రక్షణలో సాయుధ దళాల సేవలను కొనియాడుతూ నిర్వహించిన ఈ పేరేడ్ కార్యక్రమం దేశభక్తి భావాలను మరింత పెంపొందించేలా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు భారత సాయుధ దళాల క్రమశిక్షణ, సేవా తత్వం, దేశ భద్రత పట్ల వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిమ్స్ నూతన డైరెక్టర్ డా. రాహుల్ దేవ్ రాజ్ కు శుభాకాంక్షలు తెలిపిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్13:**ఇటీవల పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రి డైరెక్టర్ గా నియమితులైన డా.రాహుల్ దేవ్ రాజ్ ని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో పేరు,ప్రఖ్యాతలు కలిగిన నిమ్స్ ఆసుపత్రికి వచ్చే పేదలకు ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్. రాజు,సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# యాప్ వినియోగంపై రైతులకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలి

**- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**- ప్రతి ఊరిలో ఆదర్శ రైతులకు శిక్షణ ఇవ్వాలి**
**- వ్యవసాయ శాఖ ఉన్నతాధికారుల సమావేశంలో ఎమ్మెల్యే కీలక సూచనలు**





**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్ 13:** వ్యవసాయ రంగంలో ఎరువుల పంపిణీ కోసం ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన డీఏపీ యాప్ విధానంతో రైతులు, ఫెర్టిలైజర్ వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వ్యవసాయ శాఖ అధికారులకు సూచించారు. రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులతో నందిగామ లో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని రైతుల సమస్యలపై గళమెత్తారు. అవగాహన లేకనే ఎరువుల నిల్వలు:సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. రైతులు పత్తి, వరి, మొక్కజొన్న తదితర పంటలకు ఎంత మోతాదులో ఎరువులు వాడాలో సరైన శాస్త్రీయ అవగాహన లేకుండా వాడుతున్నారని పేర్కొన్నారు. గతంలో యూరియా దొరకదేమోననే వదంతులతో రైతులు భయాందోళనలకు గురై, పది బస్తాలు అవసరమయ్యే చోట ఇరవై బస్తాలు కొనుగోలు చేసి నిల్వ చేసుకునేవారని గుర్తుచేశారు. ఈ క్రమంలో యూరియా పంపిణీకి యాప్ విధానం తీసుకురావడంతో ఆ సమస్య చాలా వరకు పరిష్కారమైందని ఆయన తెలిపారు. కొత్త యాప్‌తో సాంకేతిక చిక్కులు:యూరియా తరహాలోనే ఇప్పుడు పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న డీఏపీ యాప్‌లో అనేక సాంకేతిక లోపాలు (టెక్నికల్ ఎర్రర్స్) తలెత్తుతున్నాయని ఎమ్మెల్యే అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల డీలర్లు, రైతులు ఎరువులు తీసుకోలేక తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్నప్పటికీ, సామాన్య రైతులకు స్మార్ట్‌ఫోన్ వినియోగం, యాప్ ద్వారా ఎరువుల వివరాలు నమోదు చేయడంపై ఇంకా పూర్తిస్థాయి అవగాహన రాలేదని స్పష్టం చేశారు. విధానాలు రూపొందించే అధికారుల అంచనాలకు, క్షేత్ర స్థాయిలో సామాన్యులు పడుతున్న ఇబ్బందులకు వ్యత్యాసం ఉందన్నారు. గ్రామాల్లో ఆదర్శ రైతులకు శిక్షణ:రాబోయే సీజన్ నాటికి ఈ యాప్ ఇబ్బందులను అధిగమించడానికి వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంకర్ సూచించారు. గ్రామ స్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి గ్రామం నుంచి ఇద్దరు, ముగ్గురు ఆదర్శ రైతులను ఎంపిక చేసి, వారికి యాప్ వినియోగంపై ముందుగా శిక్షణ ఇస్తే.. వారు ఆయా గ్రామాల్లోని మిగతా రైతులకు ఎరువుల కొనుగోలులో సహాయపడతారని ఆయన అధికారులకు ఓ చక్కటి పరిష్కారాన్ని సూచించారు. ఈ కీలక సమావేశంలో వ్యవసాయ శాఖ అడిషనల్ డైరెక్టర్లు కే. విజయ్ కుమార్, బి. నరసింహారావు, ఏడీఏలు మాధవి, సత్యంబాబు, ఏడీఎస్ శైలజతో పాటు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడీఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జీకే కాలనీలో సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద్ ఆకస్మిక పర్యటన

**-త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు -చిరు వ్యాపారుల ఉపాధికి భంగం కలగకుండా చర్యలు**
**-కాలనీ సంక్షేమ సంఘం భవనం, రోడ్ల నిర్మాణ అంశాలపై సమీక్ష -ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని స్పష్టం**





**జగద్గిరిగుట్ట, జూన్ 13 ( నమస్తే భరత్ ):**జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) కాలనీలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం విస్తృతంగా పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, స్థానిక నాయకులు, కాలనీ వాసులతో కలిసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు ప్రధానంగా త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపుల తొలగింపు అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా సంక్షేమ సంఘం భవన నిర్మాణం, అంతర్గత రహదారుల అభివృద్ధి వంటి సమస్యలను కూడా వివరించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించిన ఎమ్మెల్యే వివేకానంద్, మాజీ కార్పొరేటర్ జగన్‌తో కలిసి కాలనీలోని పలు ప్రాంతాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ, కాలనీ ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. త్రాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలను అత్యవసర ప్రాతిపదికన పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. చిరు వ్యాపారుల సమస్యపై స్పందిస్తూ, ఉపాధి కోసం చిన్నచిన్న దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారి జీవనోపాధి దెబ్బతినకుండా తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అధికారులు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని, చిరు వ్యాపారుల సమస్యను కూడా సానుకూలంగా పరిశీలించి వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాజీవ్ గృహకల్పలో సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేయాలి

**- వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కల్పించాలి**
**- త్రాగునీటి సరఫరా వేళల్లో మార్పులు చేయాలని అధికారులకు ఆదేశం**
**- డ్రైనేజీ సమస్యతో వర్షపు నీరు ఇళ్లలోకి చేరుతోందని స్థానిక వాసుల ఆవేదన**
**- రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటన**





**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో నెలకొన్న త్రాగునీరు, డ్రైనేజీ, వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. శనివారం 126వ డివిజన్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో ఎమ్మెల్యే వివేకానంద్ వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం వార్డు కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికే వరద నీరు ఇళ్లలోకి చేరుతోందని, అర్ధరాత్రి సమయంలో తక్కువ ఒత్తిడితో త్రాగునీరు సరఫరా చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాసులు వివరించారు. అలాగే జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిన్న వ్యాపార డబ్బాలను తొలగించాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం వల్ల ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ రాజీవ్ గృహకల్ప సముదాయంలో అధిక సంఖ్యలో పేద, మధ్యతరగతి కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. కూలి పనులు, ప్రైవేట్ ఉద్యోగాల కోసం నగరంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రజలకు అర్ధరాత్రి వేళల్లో త్రాగునీరు సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. త్రాగునీటి సరఫరా సమయాలను పునర్వ్యమర్శించి సాయంత్రం వేళల్లో నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచి వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. వీధి వ్యాపారులు జీవనోపాధి కోల్పోకుండా వారికి ప్రత్యామ్నాయ స్థలాలు, అనువైన మార్గాలు కల్పించి సమస్యను సామరస్యపూర్వకంగా పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, వివిధ శాఖల అధికారులు, రాజీవ్ గృహకల్ప సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, మహిళలు, గృహకల్ప వాసులు తదితరులు పాల్గొన్నారు.

# వర్షపు నీటిని ఒడిసిపట్టడమే భూగర్భ జలాలకు భరోసా

**- మొతినగర్‌లో ఇంకుడు గుంతలపై అవగాహన కార్యక్రమం**
**- ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని పిలుపు**
**- వాన నీటిని భూమిలోకి మళ్లిస్తే బోర్లలో నీటి లభ్యత పెరుగుతుంది**
**- వరదల నివారణకు, నీటి సంరక్షణకు సమర్థ మార్గం**
**- పోస్టర్ ఆవిష్కరించిన సేవ్ సంస్థ అధినేత విజయరామ్**



**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):** రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జల మట్టాలను కాపాడుకోవాలంటే వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టడం అత్యవసరమని నీటి సంరక్షణ నిపుణులు సూచించారు. ఈ నేపథ్యంలో మొతినగర్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో "ఇంకుడు గుంతలు తవ్వండి -- వర్షపు నీటిని ఒడిసిపట్టండి" అనే నినాదంతో రూపొందించిన పోస్టర్‌ను సేవ్ సంస్థ అధినేత విజయరామ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో వర్షపు నీటి సంరక్షణ వల్ల భవిష్యత్ తరాలకు తాగునీటి భద్రత కల్పించవచ్చని వక్తలు పేర్కొన్నారు. ప్రతి ఇంటి ఆవరణలో, కాలనీల్లో వర్షపు నీరు పారిపోయే ప్రాంతాల్లో సుమారు మూడు అడుగుల వెడల్పు, నాలుగు నుంచి ఆరు అడుగుల లోతుతో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని సూచించారు. గుంతలను కంకర, ఇసుక, ఇటుక ముక్కలతో నింపడం ద్వారా వర్షపు నీరు వేగంగా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలను పునరుద్ధరిస్తుందని వివరించారు. వానాకాలం ప్రారంభానికి ముందే ఇంకుడు గుంతల నిర్మాణాన్ని పూర్తి చేస్తే బోర్లు, బావుల్లో నీటి లభ్యత పెరగడంతో పాటు వర్షాల సమయంలో నీటి నిల్వలు, స్థానిక వరదల సమస్య కూడా తగ్గుతుందని తెలిపారు. నీటి సంరక్షణను ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా భావించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రముఖ సామాజికవేత్త, పర్యావరణ పరిరక్షణ సమితి చైర్మన్ లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ, నీటి వనరుల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని అన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక ఇంకుడు గుంతను నిర్మించి వర్షపు నీటిని భూమిలోకి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రజల్లో నీటి సంరక్షణపై చైతన్యం పెంపొందించి, భూగర్భ జలాల పరిరక్షణకు సామూహిక కృషి అవసరమని కార్యక్రమంలో పాల్గొన్న వారు అభిప్రాయపడ్డారు.

# అక్రమ చొరబాటుదారులపై ఉక్కుపాదం

**- జీడిమెట్లలో ఏడుగురు బంగ్లాదేశీయుల అరెస్ట్**
**- ఎస్ఓటీ--జీడిమెట్ల పోలీసుల సంయుక్త ఆపరేషన్ విజయవంతం**
**- చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేవని గుర్తింపు**
**- జోగిపేట డిపోర్టేషన్ కేంద్రానికి తరలింపు**
**- అక్రమ వలసదారులపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని పోలీసుల హెచ్చరిక**





**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):** అక్రమ వలసదారులపై కఠిన చర్యలు కొనసాగిస్తున్న జీడిమెట్ల పోలీసులు మరో కీలక విజయాన్ని నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం, నిఘా వర్గాల నుంచి అందిన పక్కా ఆధారాల మేరకు ఎస్ఓటీ కూకట్‌పల్లి జోన్ సిబ్బంది, జీడిమెట్ల పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఏడుగురు బంగ్లాదేశ్ జాతీయులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం, గజులరామారం--జీడిమెట్ల పరిధిలోని హెచ్ఏఎల్ ప్రాంతంలోని ఓ అద్దె ఇంట్లో కొందరు విదేశీయులు అనుమానాస్పదంగా నివసిస్తున్నట్లు సమాచారం అందింది. వెంటనే జీడిమెట్ల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ నేతృత్వంలోని ప్రత్యేక బృందం అక్కడ సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఏడుగురు బంగ్లాదేశ్ జాతీయులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా, భారతదేశంలో నివసించేందుకు అవసరమైన చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్టులు, వీసాలు లేదా ఇతర ప్రయాణ అనుమతి పత్రాలు ఎవరి వద్దా లేవని తేలింది. ప్రాథమిక దర్యాప్తులో వారు అక్రమంగా భారతదేశంలోకి ప్రవేశించి, దేశంలోని వివిధ ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా నివసిస్తున్నట్లు వెల్లడైంది. దీంతో కుత్బుల్లాపూర్ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు సంబంధిత చట్టాల ప్రకారం వారిపై నిర్బంధ, కదలికల నియంత్రణ చర్యలు అమలు చేశారు. అనంతరం వారిని మెదక్ జిల్లా జోగిపేటలోని డిపోర్టేషన్ కేంద్రానికి తరలించారు. సంబంధిత అధికారుల ధృవీకరణ, చట్టపరమైన ప్రక్రియ పూర్తయిన అనంతరం వారిని బంగ్లాదేశ్‌కు బహిష్కరించి స్వస్థలాలకు పంపించేం దుకు చర్యలు చేపట్టనున్నట్లు పోలీసులు తెలిపారు. అక్రమ వలసలు, విదేశీయుల చట్టవిరుద్ధ నివాసాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్న పోలీసు శాఖ, ప్రజల భద్రత కోసం ఇలాంటి తనిఖీలు, ప్రత్యేక ఆపరేషన్లు భవిష్యత్తులో కూడా మరింత విస్తృతంగా కొనసాగుతాయని స్పష్టం చేసింది. ఈ ఆపరేషన్ విజయవంతం కావడంలో జీడిమెట్ల పోలీసు బృందం, ఎస్ఓటీ సిబ్బంది అప్రమత్తత, నిఘా సామర్థ్యం, సమన్వయ కృషి కీలక పాత్ర పోషించాయని ఉన్నతాధికారులు అభినందించారు.

# ఖమ్మం పట్టణం, రాపర్తి నగర్ లో చిన్నారి పై అత్యాచారం


**- బాధితురాలిని పరామర్శించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**
**- తక్షణ సహాయ నిమిత్తం 50,000 అందించిన ఎమ్మెల్యే**



**నమస్తే భారత్ షాద్ నగర్ జూన్13:**ఖమ్మం జిల్లాలోని రాపర్తి నగర్‌లో జరిగిన ఘటనలో తీవ్ర గాయాలపాలై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పరామర్శించారు. ఈ దారుణ ఘటనలో, మహమ్మద్ గౌస్ అనే 49 ఏళ్ల స్థానిక డ్రైవర్, 12 ఏళ్ల మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడి , ఆమెను ఒక అపార్ట్‌మెంట్ భవనం పైకప్పు పైనుంచి కిందకు తోసేశాడు. ఈ సంఘటన 2026 జూన్ 6వ తేదీన జరిగింది .ఆ మైనర్ బాలిక కొత్తగూడెం నుండి అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న తన తాతను కలవడానికి వచ్చింది. నిందితుడు ఆమెను ఒక మూలకు నెట్టి, లైంగికంగా వేధించడానికి ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించి కేకలు వేయడంతో, తన నేరాన్ని కప్పిపుచ్చుకోవడానికి అతను ఆమెను భవనం పైనుంచి తోసేశాడు. మొదట ఆమె ప్రమాదవశాత్తు పడిపోయిందని వారు భావించారు. ఆమె వెన్నెముక, చేతులు, పక్కటెముకలకు తీవ్రమైన పలు విరుగుళ్లతో పాటు, అంతర్గత గాయాలకు కూడా గురైంది. జూన్ 8, 2026న, ఆమె ఆసుపత్రిలో స్పృహలోకి వచ్చి, జరిగిన దారుణాన్ని తన కుటుంబానికి వివరించినప్పుడు అసలు నిజం వెలుగులోకి వచ్చింది. ఇట్టి విషయం తెలుసుకున్న షాద్ నగర్ ఎమ్మెల్యే , ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రికి వెళ్ళి బాధితురాలిని పరామర్శించారు. తక్షణ సహాయంగా 50,000/- అందించారు. ప్రభుత్వ పరంగా సహాయం అందిస్తామని అలాగే నిదితుడి పై కఠిన చర్యలు తీసుకుంటామని బాలికా తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ నాయకులు సంపత్ కుమార్, ఎన్.రాజు, ఏం. ఎన్.రావు తదితరులు పాల్గొన్నారు.

# రిపోర్టర్‌పై దాడిఅ త్యంత దురదృష్టకరం

**- బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి**



**నర్సంపేట జూన్ 13 ( నమస్తే భారత్ ) :** ప్రజాస్వామ్యంలో నాలుగో స్థంభంగా ఉన్న మీడియా ప్రతినిధులపై దాడులు జరగడం అత్యంత దురదృష్టకరమని బీజేపీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి అన్నారు. శనివారం బాధిత రిపోర్టర్ ను పరామర్శించిన ఆయన మాట్లాడుతూ వార్తా సేకరణ కోసం విధులు నిర్వహిస్తున్న నర్సంపేట రిపోర్టర్ సత్యనారయణపై శుక్రవారం దాడి జరగడం నర్సంపేటలో శాంతిభద్రతల పరిస్థితికి అద్దం పడుతోం దన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత రిపోర్టర్‌కు న్యాయం చేయాలని పోలీసు అధికారులను డిమాండ్ చేశారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు. ప్రశ్నించే గొంతులను అణచివేయాలనే ప్రయత్నాలను ప్రజాస్వామ్యవాదులు ఎప్పటికీ సహించరని డాక్టర్ గోగుల రాణా ప్రతాప్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్,మాజీ కౌన్సిలర్ జుర్రు రాజు,ఉపాధ్యక్షులు ఠాకూర్ విజయ్ సింగ్,కాసుల నాగేంద్ర బాబు, బిజెవైఎం జిల్లాఉపాధ్యక్షులు కొంకిస విఘ్నేష్ ,పులిపాక అశోక్,శోభన్,సామల ప్రవీణ్,చిలువేరు అన్వేష్ ,గోస్కుల సందీప్ ,చందు,యశ్వంత్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# బౌరంపేటలో రూ.కోటితో సీసీ రోడ్డు పనులు వేగవంతం

**- ప్రాధాన్యత క్రమంలో కుత్బుల్లాపూర్‌లో అన్ని ప్రాంతాల అభివృద్ధి**
**- లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం**
**- పట్టణీకరణకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనపై దృష్టి**
**- పనులను పరిశీలించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**





**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపడతామని బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పేర్కొన్నారు. సీఎంసీ దుండిగల్ సర్కిల్ పరిధిలోని బౌరంపేట లహరి గ్రీన్ పార్క్‌లో సుమారు రూ.కోటి వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పెరుగుతున్న జనాభా, వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గత 12 సంవత్సరాలుగా కోట్లాది రూపాయల నిధులతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతులు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన ద్వారా నియోజకవర్గాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. లహరి గ్రీన్ పార్క్ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజల సహకారం ఎంతో అవసరమని, రానున్న రోజుల్లో కూడా నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ మిద్దెల బాల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు సునీత మురళీ యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, టెర్రా అసోసియేషన్ జనరల్ సెక్రటరీ వెలగపూడి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు మురళి, ప్రశాంత్, కాటం శ్రీనివాస్, నాయకులు ఎస్వీ సురేందర్‌రెడ్డి, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుండిగల్ ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో ఘనంగా పేరేడ్ కార్యక్రమం

**-రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమక్షంలో ఆకట్టుకున్న వేడుక**
**-బీజేపీ తెలంగాణ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ జీ, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు హాజరు**
**-మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, నేతలతో కలిసి పాల్గొన్న రావుల శేషగిరి**
**-జాతీయ భద్రత, దేశభక్తి స్ఫూర్తిని చాటిన కార్యక్రమం**





**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):**దుండిగల్‌లోని ఎయిర్ ఫోర్స్ అకాడమీ లో భారత రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ పర్యటన సందర్భంగా నిర్వహించిన పేరేడ్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ చంద్రశేఖర్ జి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రవు , మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో–కన్వీనర్, గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి ప్రముఖ నాయకులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. దేశ రక్షణలో సాయుధ దళాల సేవలను కొనియాడుతూ నిర్వహించిన ఈ పేరేడ్ కార్యక్రమం దేశభక్తి భావాలను మరింత పెంపొందించేలా సాగింది. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు భారత సాయుధ దళాల క్రమశిక్షణ, సేవా తత్వం, దేశ భద్రత పట్ల వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బహదూర్‌పల్లిలో రోడ్ల మరమ్మతులు పూర్తి

**- ప్రజా సమస్యల పరిష్కారంలో కిషోర్ రెడ్డి చొరవకు ప్రశంసలు - వర్షాకాలానికి ముందే గుంతల రోడ్లకు ప్యాచ్ వర్కులు - తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌లకు కొత్త మూతల ఏర్పాటు**
**- అధికారులు, సిబ్బంది వేగవంతమైన స్పందన - కాలనీ ప్రజల తరఫున కిషోర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు**





**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):** వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలలో భాగంగా బహ దూర్‌పల్లి 294వ డివిజన్‌లో రోడ్ల మరమ్మతులు, మ్యాన్‌హోల్ మూతల ఏరా ్పటు పనులు పూర్తయ్యాయి. ఈ పనుల అమలుకు కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రోటోకాల్ అండ్ కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ పరిధిలో గుంతలమయంగా మారిన రోడ్లు, తెరిచి ఉన్న మ్యాన్‌హోల్‌ల కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన కిషోర్ రెడ్డి, సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన ఆదేశాల మేరకు అధికారులు స్పందించి రోడ్లకు ప్యాచ్ వర్కులు పూర్తి చేయడంతో పాటు ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్‌లకు కొత్త మూతలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 294వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఏ.ఆర్. సాదు యాదవ్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో వేగంగా స్పందించి పనులు పూర్తి చేయడం అభినందనీయమన్నారు. వర్షాకాలంలో ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల కాలనీ వాసులకు ఉపశమనం కలిగిందని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న కిషోర్ రెడ్డి, సహకరించిన అధికారులకు, సిబ్బందికి కాలనీ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజల భద్రత, సౌకర్యాల విషయంలో ఇలాంటి చర్యలు కొనసాగాలని స్థానికులు ఆకాంక్షించారు.


# జాంబవంతుని గుడి స్థలంపై అక్రమ నిర్మాణాలు తొలగించాలి

**- కబ్జాలకు అడ్డుకట్ట వేయాలని దళిత సంఘాల డిమాండ్**
**- స్థలాన్ని రక్షించేందుకు ఐక్యంగా పోరాడతామని హెచ్చరిక**
**- చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామన్న నాయకులు**



**కుత్బుల్లాపూర్, జూన్ 13 ( నమస్తే భరత్ ):** జగద్గిరిగుట్టలోని జాంబవంతుని గుడి స్థలాన్ని కబ్జా చేసేందుకు జరుగుతున్న ప్రయత్నాలను తీవ్రంగా ఖండిస్తూ, ఆ స్థలాన్ని పరిరక్షించేందుకు దళిత సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయని నాయకులు హెచ్చరించారు. ఈ అంశంపై శనివారం నిర్వహించిన సమావేశంలో పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాంబవంతుని గుడి స్థలంలో కొందరు వ్యక్తులు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ఆ స్థలాన్ని విక్రయించి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవల కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గతంలో ఇదే స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టినప్పుడు రెవెన్యూ అధికారులు వాటిని తొలగించారని గుర్తు చేశారు. అయినప్పటికీ మళ్లీ మళ్లీ కబ్జా యత్నాలు కొనసాగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జాంబవంతుని గుడి స్థలంపై ఎలాంటి అక్రమ నిర్మాణాలు జరగకుండా అధికారులు శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు వెంటనే స్పందించి ప్రస్తుతం జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరారు. లేనిపక్షంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. జాంబవంతుని గుడి స్థలాన్ని విక్రయించేందుకు లేదా కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో దళిత హక్కుల పోరాట సమితి నాయకులు దొరవి బాబు, రాములు, ఎంఆర్పీఎస్ నాయకులు అల్వాల భాస్కర్, ఆర్టీసీ బాబు, ముఖేష్, రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

# నెట్టింట 3డీ కార్టూన్ ఫీవర్!



సోషల్ మీడియాలో స్క్రోల్ చేస్తుంటే.. ఒకదాని తర్వాత ఒకటి 3డీ ముఖాలు, క్యారెక్టర్లు కనిపిస్తున్నాయా? పెద్ద తల, చిలిపి కళ్లతో నవ్వుతున్న ఫొటోలు చూడగానే.. కార్టూన్ సినిమా పోస్టర్‌లా అనిపిస్తున్నాయా? అయితే, మీరు ఇప్పటికే మొదలైన కొత్త ట్రెండ్ జోన్‌లో ఉన్నారు! ఎందుకంటే.. ఇప్పుడు అందరూ తమ సెల్ఫీలను సినిమా లుక్‌లోకి మార్చుకుంటున్నారు. ఆ ట్రాన్స్‌ఫర్మేషన్ వెనుక ఉన్న మాయాజాలం.. గూగుల్ జెమినీ నానో బనానా ప్రో! ఇది ఫొటోను సాధారణ ఫిల్టర్‌లా మార్చదు.. పూర్తిగా కొత్తదానిలా క్రియేట్ చేస్తుంది. అందుకే ఫొటోలోని ముఖం, భావం, లైటింగ్ అన్నీ రియలిస్టిక్‌గా కనిస్తాయి. దానికితోడు చిలిపిగా, పిక్సర్ స్టయిల్‌లో ఆకట్టుకుంటాయి. ఇలాంటివే ఇప్పుడు ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తెగ వైరల్ అవుతున్నాయి. ఈ ట్రెండ్‌ని ఇప్పటికే పలువురు ఏఐ క్రియేటర్లు ట్రై చేశారు. సింపుల్‌గా.. '3డీ క్యారికేచర్ లుక్‌లో, పెద్ద తలతో, చిలిపి ముఖ కవళికలతో ఫొటో కావాలి' అని ప్రాంప్ట్ చేస్తే సరిపోతుంది. మీకు కావాల్సిన క్యారెక్టర్ మీ కళ్ల ముందు వాలిపోతుంది. ఇందులో ఆశ్చర్యపడి పోవడానికి ఏం లేదు. జెమినీ మోడల్ తన క్రియేటివ్ జీనియస్ ఎప్రోచ్‌తో ఇదంతా చేస్తున్నది. ఫొటోను ఎక్కడా ఎడిట్ చేయదు.. కొత్తగా ప్రొడ్యూస్ చేసి ఇస్తుంది. మాటలతో, ఎమోషన్‌తో, బ్యాక్‌డ్రాప్‌తో అన్నీ మీరు కోరినట్టుగా ఇచ్చేస్తుంది. ఉదాహరణకు.. 'పారిస్ సన్‌సెట్‌లో నా 3డీ ఫొటో కావాలి' అని చెబితే.. ఆ సన్నివేశం, ఆ లైటింగ్ అన్నిటినీ ఫొటోలో జొప్పిస్తుంది. ఫొటో డీటెయిల్స్, వెబ్ డేటా అన్నిటినీ కలిపి.. నిజంగా జీవం ఉన్న ఫొటోని స ృష్టిస్తుంది. అన్నీ కలిపి నిజంగా మీరే అనిపించేలా, ఫిల్మీ లుక్‌లో మెరిసే క్యారికేచర్‌గా మారిపోతుంది. ఈ ఫీచర్ ప్రత్యేకత ఏమిటంటే.. యూజర్ తన ఇమేజ్ టోన్‌ని మాటలతోనే కంట్రోల్ చేయొచ్చు. కాన్ఫిడెంట్‌గా స్మైలింగ్/ డ్రామాటిక్ లైటింగ్ లాంటి పదాలు వాడితే.. అదే మూడ్‌కి తగ్గట్టుగా ఏఐ ఫొటోని తయారు చేస్తుంది. అందుకే ఈ ట్రెండ్ ఇప్పుడు యూత్‌లో బాగా పాపులర్ అయింది. వాళ్లకి ఇది ఫన్, క్రియేటివ్ అవుట్‌లెట్ కూడా. 'నా ఫొటోను కూడా ఇలా మార్చితే ఎలా ఉంటుంది?' అని మీకూ అనిపిస్తున్నదా!? అయితే వెంటనే ట్రై చేసేయండి.

# ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డు



ఏలూరు, : ఏపీలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ప్రజలకు సులభంగా, పారదర్శకంగా రేషన్ అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డులను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అక్రమార్కులకు చెక్ పెట్టాలని భావిస్తోంది. ఆగస్టు నుంచి వీటిని పంపిణీ చేస్తోంది ఏపీ. ఇప్పటికే చాలా వరకు పంపిణీ చేసింది.

గ్రామ, వార్డు సచివాలయాల్లో అధికారులకు అప్పగించే బాధ్యతను ఇచ్చింది. అంతేకాదు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ప్రభుత్వం చెప్పింది. పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం టార్గెట్ పెట్టుకుంది. అయితే చాలా మంది లబ్ధిదారులు ఇంకా వాటిని తీసుకోలేదు. వేలాది కార్డులు పంపిణీ చేయలేదు. 15వ తేదీ తర్వాత వాటిని కమిషనరేట్‌కు పంపనున్నారు.గడువు దగ్గరకు వచ్చినా.. సరే అర్హులైన కొందరు స్మార్ట్ రేషన్ కార్డులను తీసుకోలేదు. ఇంకా చాలా కార్డులు పంపిణీ కోసం ఎదురుచూస్తున్నాయి. కొందరికి కార్డులు తీసుకోవాలని సమాచారం ఇస్తున్నా స్పందించడం లేదని అధికారులు చెబుతున్నారు. సచివాలయ సిబ్బంది, డీలర్లు వారికి ఇచ్చేందుకు ప్రయత్నాలు చేసిన కొన్ని ప్రాంతాల్లో కుదరడం లేదు.అయితే ప్రస్తుతం అందుబాటులో లేకుండా ఉన్నవారు స్మార్ట్ రేషన్ కార్డు తీసుకోకపోవడంపై ఆందోళనలో ఉన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ గడువు ఈ నెల 15వ తేదీతో ముగుస్తుంది. ఒకవేళ కార్డులు తీసుకోకుంటే రద్దు చేస్తారని చాలా మంది అపోహలో ఉన్నారు. కానీ ప్రభుత్వం ఆ విధంగా చేయదు.సచివాలయాల్లో చిరునామాతోపాటుగా స్మార్ట్ రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం రూ.200 రుసుము చెల్లించాలి. తర్వాత కమిషనరేట్ నుంచి చిరునామాకు రేషన్ కార్డు పంపిస్తారు. ఈ పోస్ యంత్రంలో స్మార్ట్ రేషన్ కార్డులను స్వైప్ చేయగానే.. లబ్ధిదారుల వివరాలు కనెక్ట్ అవుతాయి. బయోమెట్రిక్, ఫింగర్ ప్రింట్, ఐరిస్ స్కాన్ ద్వారా కూడా స్కాన్ చేసి సరకులు అందిస్తారు.

# బీహార్ లో ఎయిడ్స్ కలకలం..!?




పాట్నా:సరిగ్గా రెండు దశాబ్దాల క్రితం మనదేశంలో హెచ్ఐవి అధికంగా ఉండేది. సురక్షితం కానీ శృంగారంలో పాల్గొనడం వల్ల చాలా మంది హెచ్ఐవి బారిన పడేవారు. ఈ వ్యాధి వల్ల చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అప్పట్లో ఐక్యరాజ్యసమితి హెచ్ఐవి మీద యుద్ధం ప్రకటించడంతో హెచ్ఐవి తగ్గుముఖం పట్టింది. ఇప్పటికి కూడా ప్రపంచవ్యాప్తంగా కొన్ని ప్రాంతాలలో హెచ్ఐవి కేసులు నమోదు అవుతూనే ఉన్నాయి. ఇక మనదేశంలో చూసుకుంటే హెచ్ఐవి కేసులు తగ్గుముఖం పడుతూనే ఉన్నప్పటికీ.. ఒక రాష్ట్రంలో మాత్రం రికార్డు స్థాయిలో హెచ్ఐవి కేసులు నమోదయ్యాయి.సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఓ పోస్ట్ ప్రకారం.. మన దేశంలోని బీహార్ రాష్ట్రంలో ఓ జిల్లాలో 7,400 హెచ్ఐవి కేసులు నమోదయ్యాయి. ఇందులో 400 మంది చిన్నారులు కూడా ఉండడం విశేషం. 7400 హెచ్ఐవి బాధితులలో 3,544 మంది మహిళలు, 2,733 మంది పురుషులు ఉన్నారు. సోషల్ మీడియాలో దీనికి సంబంధించిన పోస్ట్ విపరీతంగా సర్కులేట్ అవుతున్న నేపథ్యంలో రకరకాల చర్చలు మొదలయ్యాయి.. కొందరేమో ఒక మత ఆచారం ప్రకారం బీహార్ రాష్ట్రంలో నుదుటిమీద కత్తితో ఘాటు పెట్టుకుంటారని.. దీనివల్ల హెచ్ఐవి వ్యాప్తి చెంది ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మరికొందరేమో ఈ వీడియో ఉత్తర ప్రదేశ్‌లో తీసిందని.. దానిని అనవసరంగా బీహార్ రాష్ట్రానికి ఆపాదిస్తున్నారని వివరిస్తున్నారు.వాస్తవానికి హెచ్ఐవి వ్యాప్తి అనేది కొంతకాలంగా మన దేశంలో తగ్గుముఖం పట్టింది. ఈ వ్యాధి పై ప్రభుత్వం విస్తృతస్థాయిలో అవగాహన కల్పిస్తోంది. మరోవైపు శృంగారం లో పాల్గొనేటప్పుడు చాలామంది రక్షణ విధానాలను పాటిస్తున్నారు. అందువల్ల హెచ్ఐవి వ్యాప్తి చాలావరకు తగ్గిపోయింది.

# ట్రాఫిక్ సమస్యలకు చెక్

తిరుపతి: తిరుపతి అభివృద్ధికి తగ్గట్టుగానే ట్రాఫిక్ కూడా భారీగా పెరుగుతోంది. స్థానికంగా విస్తరిస్తున్న నగరం, వివిధ ప్రాంతాల నుంచి స్వామి దర్శనానికి వస్తున్న భక్తుల వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఇబ్బంది పెడుతోంది. అందుకే ట్రాఫిక్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణానికి సిద్ధమవుతోంది తుడా. దీనికి సంబంధించిన ప్రక్రియను కూడా ప్రారంభించింది.

తిరుపతి అర్బన్ డెవల ప్మెంట్ చైర్మన్ దివాకర్ రెడ్డి అధికారులతో కలిసి తిరుపతిలో పర్యటించారు. ఔటర్ రింగ్ రోడ్డు ప్రతిపాదించిన ప్రాంతాల్లో తిరిగి సాధ్యాసాధ్యాలను పరిశీలించారు.

తిరుపతి గ్రామీణ, చంద్రగిరి,రామచంద్రాపురం, రేణిగుంట, వడమాలపేట మండలాల్లో ప్రాంతాలను ఆయన చెక్ చేశారు. దాదాపు90కిలోమీటర్ల మేర ఈ ఔటర్ రింగ్ రోడ్డును ప్రారంభించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ప్రాంతాల్లో సర్వే కూడా ప్రారంభించారు. 2014లో చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడే వైకుంఠ మాల పేరుతో ఈ ఔటర్ రింగ్‌రోడ్డును ప్రతిపాదించారు. అప్పట్లో ఇది ప్రతిపాదన దశలోనే ఆగిపోయింది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ దీనిని పక్కన పెట్టేసింది. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం తిరుపతిపై స్పెషల్ ఫోకస్ పెట్టింది. నగరంరూపు రేఖలు మార్చేయాలని చూస్తోంది. అందుకే రోడ్ల అభివృద్ధితోపాటు ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంది. ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న తిరుపతికి భక్తులతోపాటు పర్యాటకులు భారీగా తరలి వస్తుంటారు. ఇది పూర్తి అయితే తిరుపతికి కొత్త కళ వస్తుందని అంటున్నారు. వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసి ప్రతిపాదనలు సిద్ధం చేస్తారు. టెండర్లు పిలవనున్నారు.

# 'తిరిగి వెళ్లిపోండి'.. బ్రిటన్‌లో భారతీయుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..!



యుకె : విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో, భారతీయులు వీసా దరఖాస్తుల ఆలస్యం, వీసా తిరస్కరణ, వీసా రద్దు, వీసా ఫార్మాలిటీల కోసం స్వదేశానికి తిరిగి వెళ్ళాల్సిన అవసరం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, అమెరికాలో నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం థర్డ్ కంట్రీ వీసా ఆప్షన్ రద్దు కావడంతో, వీసా ఇంటర్వ్యూల కోసం భారతీయులు స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది,

ఇది వీసా ఆలస్యాలకు దారితీస్తోంది. విద్యార్థులు వీసాలు రద్దు అయినప్పుడు బహిష్కరణకు గురి కావడం లేదా చదువును కొనసాగించలేకపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

బ్రిటన్ లో తిరిగి వెళ్లనివారిపై ఉక్కుపాదం: బ్రిటన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. వీసా గడువు ముగిసినప్పటికీ తమ దేశాలకు తిరిగి వెళ్లని వారిని వెనక్కి తీసుకునే విషయంలో సహకరించని దేశాలపై ఉక్కుపాదం మోపాలని యుకె ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, నైజీరియాలు ఉండటంతో, ఆయా దేశాల పౌరులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధించనున్నట్లు బ్రిటన్‌కు కాబోయే హోం సెక్రటరీ (లేబర్ పార్టీ షాడో హోం సెక్రటరీ) యెవెట్ కూపర్ ఉద్ఘాటించి గట్టిగా హెచ్చరించారు.

వీసా విధానమే బేరసారాల అస్త్రంగా: అక్రమ వలసదారులను నియంత్రించడంలో భాగంగా బ్రిటన్ ప్రభుత్వం 'రిటర్న్స్' ఒప్పందాలను (తిరిగి పంపించే ఒప్పందాలు) కఠినంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం వీసా గడువు ముగిసినా లేదా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన తమ పౌరులను ఆయా దేశాలు తిరిగి వెనక్కి తీసుకోవాలి. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని దేశాలు సహకరించడం లేదని బ్రిటన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వీసా విధానాన్ని ఒక 'బేరసారాల అస్త్రంగా' వాడుకోవాలని కొత్త ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఆలస్యం చేస్తే : ఒకవేళ భారత్ వంటి దేశాలు తమ పౌరులను వెనక్కి తీసుకోవడంలో ఆలస్యం చేస్తే ముందుగా వీసా దరఖాస్తు రుసుములను భారీగా పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయాలని, చివరి అస్త్రంగా ఆ దేశ పౌరులకు తాత్కాలికంగా లేదా పూర్తిగా వీసాలను నిలిపివేయాలని బ్రిటన్ ఆలోచిస్తోంది.

అత్యధికులు భారతీయులే: బ్రిటన్ హోం ఆఫీస్ గణాంకాల ప్రకారం . వీసా గడువు ముగిసినా బ్రిటన్ దేశంలోనే ఉండిపోయినవారిలో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 2020 నాటికే దాదాపు 20,706 మంది భారతీయులు ఈ జాబితాలో ఉన్నట్లు అంచనా. గత ఏడాది భారత్ సుమారు 7,400 మందిని వెనక్కి తీసుకున్నప్పటికీ, పాస్‌పోర్టులు లేనివారిని గుర్తించి, వారికి అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేయడంలో భారత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యూకే అధికారులు ఆరోపిస్తున్నారు. బ్రిటన్ ఏకపక్షంగా తీసుకునే ఈ నిర్ణయం భారత్ వంటి కీలక భాగస్వామ్య దేశంతో ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన మైగ్రేషన్ అబ్జర్వేటరీ నిపుణుడు డాక్టర్ పీటర్ వాల్ష్ మాట్లాడుతూ " యూకే వీసా వ్యవస్థను అత్యధికంగా వినియోగించుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇలాంటి బెదిరింపు ధోరణిని భారత్ తేలిగ్గా తీసుకోదు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య, విద్యా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది " అని అభిప్రాయపడ్డారు.

కఠిన చర్యలకు వెనుకాడబోం : బ్రిటన్ అయితేబ్రిటన్ మాత్రం ఈ సమస్యను పరిష్కరించడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, అవసరమైతే ఏ దేశానికైనా వీసాలను ఆయుధంగా ప్రయోగించడానికి సిద్ధమని యెవెట్ కూపర్ స్పష్టం చేశారు. దీంతో బ్రిటన్‌లో చదువు, ఉద్యోగాల కోసం వెళ్లాలను కుంటున్న లక్షలాది మంది భారతీయుల్లో ఆందోళన నెలకొంది.

# ఎంపీనే బురిడి కొట్టించారు!

కాకినాడ: ఏపీలో సైబర్ నేరాలకుఅడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అనునిత్యం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం నమోదు అవుతూ వస్తోంది. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరూ సైబర్ నేరాల బాధితులే. పోలీసులు అనేక రూపాల్లో అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో చలనం లేదు. సైబర్ నేరాల బారిన పడుతూనే ఉన్నారు. మొన్నటికీ మొన్న ఏపీ మంత్రి అల్లుడు ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా కాకినాడ జనసేన ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఏకంగా రూ.92.5 లక్షలు కొల్లగొట్టారు. వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ మార్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.పూర్వాశ్రమంలో తంగేళ్ల ఉదయ శ్రీనివాస్( టీ టైమ్ వ్యవస్థాపకుడు. మొన్నటి ఎన్నికల్లో కాకినాడ నుంచి జనసేన తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే తాజాగా ఈ టైం సిఎఫ్ఓ శ్రీనివాసరావు గంగిశెట్టి కి ఓ సైబర్ మోసగాడు వాట్సాప్ లో కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ప్రొఫైల్ పిక్చర్ పెట్టుకుని మెసేజ్ చేశాడు. మొదట ఆగస్టు 22న శ్రీనివాసరావుకు మెసేజ్ పంపాడు. అది తన కొత్త నెంబర్ అని పరిచయం చేసుకున్నాడు. అయితే అది తన బాస్ ఉదయ శ్రీనివాస్ నెంబర్ అని శ్రీనివాస్ నమ్మాడు. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాడు ఎంపీ ఉదయ శ్రీనివాస్ పేరు చెప్పి అత్యవసరంగా డబ్బులు కావాలన్నాడు. కొన్ని వారాలపాటు శ్రీనివాసరావు తో వందర్లా బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు పంపమని చెప్పాడు. శ్రీనివాసరావు కూడా తన యజమాని డబ్బులు పంపమని భావించి.. 11 సార్లు ఏకంగా రూ.92.5 లక్షలు అదేవిధంగా ట్రాన్స్ఫర్ చేశారు. అయితే సెప్టెంబర్ 8న ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసులు సిఎఫ్ఓ శ్రీనివాసరావు కలుసుకోవడంతో అసలు విషయం బయటపడింది. అటువంటి రిక్వెస్ట్ తానేది ఫోన్లో చేయలేదని ఎంపీ చెప్పడంతో సైబర్ మోసానికి గురయ్యానని శ్రీనివాసరావు ఒక నిర్ణయానికి వచ్చారు.

వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులోని సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ పేరుతో ఈ మోసం జరగడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అయితే ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇప్పటివరకు ఏడు లక్షల రూపాయలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మిగిలిన డబ్బును వెనక్కి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ డబ్బులు ఎవరి బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయో తెలుసుకునేందుకు బ్యాంక్ రికార్డులు, కాల్ డేటా రికార్డులు, ఐపీ అడ్రస్లను పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు. సాక్షాత్తు ఒక ఎంపీకి పరిస్థితి వచ్చిందంటే.. సామాన్యుడి దుస్థితి ఏంటన్న ప్రశ్న వినిపిస్తోంది.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కమాన్ పూర్: రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు సెంటినరీ కాలని లోని జోన్-2 ఏరియాలో గల క్వార్టర్స్ లో ప్రతి ఇంటింటికీ వెళ్ళి పరిసరాల పరిశుభ్రత గురించి వారికి వివరించి, పరిసరాలలో అపరిశుభ్రంగా ఉండటం వలన ఈగలు, దోమల సంఖ్య పెరిగి వైరల్ ఫివర్స్ రావడం జరుగుతుందని, దీని వల్ల అందరూ అనారోగ్యం నకు గురికావడం జరుగుతుందని, అలా జరగకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారికి వివరించడం జరిగింది. అదేవిధంగా నాగేపల్లి చౌరస్తాలో ప్రతి దుకాణం లోకి వెళ్లి దుకాణ యజమానికి మరియు వినియోగదారులకు ప్లాస్టిక్ వినియోగం వలన జరిగే అనర్థాలను వివరించి, ప్లాస్టిక్ వాడడం వలన మన దేశం లో రోజు రోజుకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. నాగేపల్లి చౌరస్తా లో వినియోగదారులందరికీ నృత్య రూపంలో మరియు పాటల రూపంలో అందరికీ అర్థమయ్యేలా ప్లాస్టిక్ వాడకం ను తగ్గించి, బట్ట సంచులను వాడాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ భూతం వేషధారణలో ఉన్న అబ్బాయి రిత్విక్ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.

# తమిళనాడులో రూ.1000 కోట్ల పైగా సైబర్ మోసాలు



ఢిల్లీ:తమిళనాడులో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లిన సైబర్ మోసాలకు సంబంధించి లక్షకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పి) తెలిపింది. సైబర్ నేరస్థులు ఫిషింగ్ ఇమెయిల్లు, నకిలీ వెబ్‌సైట్‌లు లేదా హానికరమైన అటాచ్‌మెంట్‌లు వంటి మోసపూరిత వ్యూహాలను ఉపయోగించి ప్రజలను మోసం చేశారు. భారీ రాబడి వస్తుందని నమ్మబలికి నకిలీ ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేయించి భారీ స్కాములకు పాల్పడ్డారు. అందిన అనేక ఫిర్యాదులలో పెట్టుబడి స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ఉన్నాయి. 2024లో ఎన్సీఆర్పి పోర్టల్‌లో 1,27,041 ఫిర్యాదులు నమోదయ్యాయి. అందులో 13,287 పెట్టుబడి స్కామ్‌లు కాగా, 4,439 డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లుగా నివేదించబడ్డాయి. రూ. 1,673 కోట్లు నష్టపోయారని, అందులో రూ. 772 కోట్లు స్తంభింపజేసి, రూ. 84 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చామని సైబర్ క్రైమ్ అదనపు డైరెక్టర్‌జనరల్ ఆఫ్ పోలీస్ సందీప్ మిట్టల్ తెలిపారు. ఈ సంవత్సరం జూలై వరకు రూ.1,010 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించబడింది. అందులో రూ.314 కోట్లు స్తంభింప జేయబడ్డాయి. అవసరమైన కోర్టు ఆదేశాలు పొందిన తర్వాత రూ.62.4కోట్లు బాధితులకు తిరిగి ఇవ్వబడ్డాయి.

# గాయపడ్డ యువకునికి 50,000 అందజేత

కమాన్ పూర్ : కమాన్ పూర్ గ్రామ పంచా యతీ పరిధిలోని బాపూజీ నగర్ కు చెందిన కొంత చందు వైద్య పరీక్షల నిమిత్తం 50 వేల రూపాయలను నీట్ 2026 పేరెం ట్స్ గ్రూపువారు కొంతం వనీతకు అందజేశారు. అతని హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేయించారు. నిరుపేద కుటుం బానికి చెందిన కొంతం చందు చికిత్సకు అంత స్తోమత లేకపోవడం తో బాధిత కుటుంబం సహాయం అందించాలని పలువురిని వేడుకు ంటున్నారు. దీనిలో భాగంగా నీ కుటుంబ సభ్యులకు తెలుసుకొని వారు 50వేల రూపాయలను చందు తల్లికి అందించారు.

# ప్రపంచ మనుగడకు సవాల్‌గా ట్రంప్ !



అమెరికా ఇతర దేశాల మీద దాడిచేస్తే...కారణాలు ఉంటాయి. కానీ ఇతర దేశాలు దాడి చేస్తే అది తప్పంటాడు. ఎవరి కారణాలు వారికి ఉంటాయి. అయితే ట్రంప్ రెండోసారి అధ్యక్షుడు అయ్యాక టెంపరితనం పెరిగింది. ప్రపంచంలో పెద్దన్న పాత్ర పోషించాలని చూస్తున్నారు. సామ్రాజ్యవాద విస్తరణ కాంక్ష కనిపిస్తోంది. తన కనుసన్నల్లో అన్ని దేశాలు నడవాలన్న నిరంకుశ రాజరికం కనిపిస్తోంది. ఏ దేశం కూడా తన కనుసన్నల్లోనే నడవాలను హుంకరిస్తున్నారు. పన్నుల టారిఫ్‌లతో విరుచుకు పడుతున్నారు. మొత్తంగా రెండురకాలుగా ట్రంప్ ప్రపంచాన్ని గిప్పిట్లో పెట్టుకోవాలని చూస్తున్నారు. చెప్పినట్లు వింటే టారిఫ్‌ల బాదుడు ఉండదు. చెప్పినట్లు వినకుంటే టారిఫ్‌లు విధిస్తున్నారు. ఈ క్రమంలో చైనా,భారత్ వంటి దేశాలపై పన్నులతో విరుచుకు పడుతున్నారు. ఇలా కాని పక్షంలో బడిత ఉన్నోడిదే బర్రె అనే సామెతలో వెనిజువెలా లాంటి దేశాలపై సైనిక దాడికి దిగుతున్నాడు. ఇప్పటికే ఇరాన్, ఖతార్, సిరియాలపై విరుచుకుపడి బాంబులు వేశారు. వెనెజువెలాను తామే పాలిస్తామని చెప్పడం ఏరకమైన న్యాయం అన్నది అర్థం కాదు. ప్రపంచంలో సైనిక పాటవశక్తి ఉంటే ఏ దేశం మీదయినా దాడి చేయవచ్చా అన్న సందేహాలు వస్తున్నాయి. అలా అయితే మన దేశం నుంచి విడిపోయిన పాక్, బంగ్లా దేశ్‌లపై మనం కూడా దాడి చేసి భారత్‌లో కలిపేసుకుని, అఖండ భారత్ కలను సాకారం చేసుకోవచ్చు. అందుకు కొన్నిదేశాల మద్దతు అంటే, అమెరికాను ఎదిరించే దేశాల మద్దతు కూడగడితే చాలన్నమాట. భారత్‌లో ఉగ్రవాదులను ఉసిగొల్పుతున్న పాక్‌కు బుద్ధి చెప్పేందుకు దాడి చేస్తే అడ్డుకోవాలని ట్రంప్ చూశారు. తానే పాక్, భారత్ యుద్ధాన్ని ఆపానని అంటాడు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధం వద్దని పెత్తనం చెలాయిస్తున్నారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్లు చేయవద్దని అంటాడు. ఇలా ట్రంప్ తన తలకెక్కిన అహంకారంతో వ్యవహరి స్తున్నాడు. నిజానికి ఇప్పుడు భారత్ బంగ్లాదేశ్‌పై దాడి చేయాలి. అక్కడ మైనార్టీ హిందువులను ఊచకోత కోస్తున్నందుకు కలగచేసుకోవాలి. కానీ ఇది అంతర్జాతీయ సమస్య అవుతుంది. అదే అమెరికా వెనెజువెలాపై దాడిచేసి, ఆ దేశ అధ్యక్షుడిని పట్టుకుని వెళితే ఏ దేశం కూడా అడ్డుకోలేక పోయింది. దీంతో లాటిన్ అమెరికాలోని వెనిజులా ప్రస్తుతం ఒక విచిత్ర పరిస్థితిలో ఉంది. జనవరి మూడవ తేదీన రాజధాని కారకాస్ పై దాడి చేసిన అమెరికా నిద్రలో ఉన్న అధ్యక్షుడు మదురో, ఆయన సతీమణి సిసిలీ ఫ్లోర్స్‌ను కిడ్నాప్ చేసి ఏకంగా అ÷-ఎరికాకే తీసుకుపోయింది. నార్కో టెర్రరిస్టు అని అభియోగం మోపి న్యూయార్క్ కోర్టులో ప్రవేశపెట్టింది. తాను వెనిజులా అధ్యక్షుడినని, ఎలాంటి నేరం చేయలేదని మదురో కోర్టులో చెప్పాడు. తదుపరి ఏం జరుగుతుందో తెలియదు. తామే వెనిజులాను నడిపిస్తామని ట్రంప్ ప్రకటించాడు. అంతర్జాతీయ సంస్థలు ఏం చేస్తున్నాయో తెలియడం లేదు. ఉపాధ్యక్షురాలిగా ఉన్న డెల్సీ రోడ్రిగజ్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక తమకు సహకరించకపోతే మదురో కంటే ఎక్కువగా అనుభవించాల్సి వస్తుందని ట్రంప్ ఆమెను కూడా బెదిరించాడు. అయితే అంతర్జాతీయంగా వస్తున్న సమాచారం మేరకు . వెనిజులా లోని చమురు నిక్షేపాలను ఆక్రమించుకోవడం అమెరికా ఎత్తుగడగా ఉంది.. అమెరికా చర్యను ఐరాస ఖండించింది. మదురోను ఎలా పట్టుకున్నారు, అందుకు అనుసరించిన పద్ధతేమిటి అనే అంశాలు ఎలా ఉన్నా ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకోవాల్సిన అవసరం మాత్రం ఉంది. దీనిపై ప్రపంచ దేశాలను కూడాగట్టాల్సి ఉంది. ముదురో అపహరణ సమయంలో జరిగిన ప్రతిఘటనలో 80 మంది మరణించారని, వారిలో 32 మంది క్యూబన్లు ఉన్నట్లు వార్తలు వచ్చాయి. రెండో ప్రపంచ యుద్ధానికి ముందు జర్మన్ నియంత అడాల్ఫ్ హిట్లర్ కూడా యూదుల మారణకాండకు పాల్పడ్డాడు. నరమేధం సృష్టించాడు. గ్యాస్ ఛాంబర్‌లు పెట్టి లక్షల మందిని పొట్టన పెట్టుకున్నాడు. అనేక దేశాలను ఆక్రమించుకుంటూ పోయినా ప్రజాస్వామిక ముసుగు వేసుకున్న దేశాలేవీ అడ్డుకోలేదు. అప్పట్లో అమెరికా ఆయుధాలు కూడా అందించింది. అయితే రష్యా అధినేత స్టాలిన్ నాయకత్వంలో ప్రతిఘటించిన తరవాతనే హిట్లర్ ఆత్మహత్య చేసుకొని దిక్కులేని చావు చచ్చాడు. ఇండియాలో కూడా బ్రిటిషర్లు ఇలాగే వ్యవహరించాలరు. అంతకు ముందు మొగలులు కూడా దాడులు చేసి హిందూ ఆలయాలను ధ్వంసం చేసి ప్రజలను ఊచకోత కోశారు. మతమార్పిళ్లు చేశారు. తెలంగాణలో నైజాం నిరంకుశ రజాకార్లు కూడా ప్రజలను ఊచకోత కోశారు. ఇవన్నీ కూడా హిట్లర్‌ను మించి జరిగాయి. కాశ్మీర్‌లో మారణహోమం చూశాం. మతమార్పిళ్లు చూశాం. ఊచకోతలు చూశాం. ఇకపోతే దేశాన్ని ముక్కలు చేసేలా బ్రిటిషర్లు కుట్రలు చేశారు. అయితే ఇప్పుడు ప్రపంచ వ్యవస్థ మారంది. ఆధునిక ప్రపంచంలో ఇటీవల ఉక్రెయిన్‌పై రష్యా దాడిని, ఇప్పుడు వెనిజువెలాపై అమెరికా దాడిని చూస్తున్నాం. ఈ రెండు దేశాలు సైనికంగా బలంగా ఉండడంతో తమను ఎవరేమీ చేయలేరన్న ధీమాతో దాడులకు తెగించారు. చరిత్రను చూస్తే ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి ప్రపంచానికి నిత్యం నీతిసూత్రాలను బోధించే అమెరికా అడుగడుగునా వాటిని ఉల్లంఘించడం చూస్తున్నాం. తమ దారికి రాని వారిని ఏం చేస్తామో ఇది ప్రారంభం మాత్రమే అని మదురో అపహరణ తరువాత ట్రంప్ చెప్పాడంటే రానున్న రోజుల్లో ఇంకా ఎన్ని దాడులు చూడాల్సి వస్తుందో, ప్రపంచానికి ఎలాంటి ముప్పురానుందో అన్నది ప్రపంచ దేశాలు ఆలోచించాల్సి ఉంది. ఇప్పుడు డోనాల్డ్ ట్రంప్ రూపంలో ఉన్న అమెరికన్ ఫాసిస్టు శక్తిని నిలువరించేది ఎవరనేదే కాలమే చెప్పాలి. తమ తదుపరి లక్ష్యం మెక్సికో, కొలంబియా, క్యూబా అని కూడా ట్రంప్ చెప్పాడు. ట్రంప్ సామ్రాజ్య విస్తరణ కాంక్ష వెనిజులా ఉదంతం స్పష్టం చేసింది. అంతకు ముందు డెన్మార్క్ స్వయంపాలిత గ్రీన్‌లాండ్ తమకు కావాలని చెప్పిన సంగతి తెలిసిందే. అది కూడా త్వరలోనే స్వాధీనం చేసుకునేదాకా వదిలేట్టుగా లేడు. కెనడాను కూడా ఇలాగే బెదరించాడు. ఏది కావాలంటే దాన్ని స్వాధీనం చేసుకొనే ట్రంప్ తరహా సామ్రాజ్యవాదం ముదరితే మళ్లీ బ్రిటిష్ తరహా సామ్రాజ్యం అమెరికా ప్రారంభిస్తుందా అన్న ఆందోళన కలుగుతోంది.



## వెస్ట్‌బ్యాంక్‌లో హింసాకాండపై

# యూఎన్ఓ ఫైర్...

వెస్ట్‌బ్యాంక్‌లో కొనసాగుతున్న భయంకరమై హింసాకాండపై ఐక్యరాజ్యసమితి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ప్రాంతంలో నిశ్శబ్ధ యుద్ధం జరుగుతోందని సోమవారం హెచ్చరించింది. 2023 అక్టోబర్ నుండి వెయ్యిమందికి పైగా ప్రజలు, వారిలో మూడోవంతు మైనర్లు మరణించారని ఐక్యరాజ్యసమితి పాలస్తీనా శరణార్థుల సహాయ సంస్థ (యుఎన్ఆర్‌డబ్ల్యుఎ) కమిషనర్ జనరల్ ఫిలిప్పి లాజారినీ పేర్కొన్నారు. ఇజ్రాయిల్ స్థిరనివాసులు ఈప్రాంతంలో దాడులను కొనసాగిస్తున్నారని హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా గాజాపై దృష్టి కేంద్రీకరించినప్పటికీ, వెస్ట్ బ్యాంక్‌లో అంతర్జాతీయ మానవతా చట్టం పట్ల తీవ్ర నిర్లక్ష్యం సాధాకరణీకరించబడిందని, మరింత తీవ్రతరం కాకముందే దీన్ని ఆపాలని ఎక్స్‌లో పేర్కొన్నారు. తూర్పు జెరూసలెంలోని తమ కార్యాల యాన్ని ఇజ్రాయిల్ సైన్యం కూల్చివేయడం, నిప్పుపెట్టడంతో పాటు అదనంగా ప్రాథమిక అవసరాలైన నీరు, విద్యుత్‌ను నిరోధించిందని మండిపడింది. ఆ ప్రాంతంలో తమ సేవలు కొనసాగిల్సిన అవసరం ఉందని సంస్థ ఉద్ఘాటించింది.

జెరూసలెం గవర్నరేట్‌లోని అల్-ఐజ రియా నగరం చుట్టూ బైపాస్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించడం .. ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌లో ఇజ్రాయిల్ దాడి క్రమంగా పెరగాన్ని సూచిస్తుందని పాలస్తీనియన్ నేషనల్ అథారిటీ జనవరి 28న హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఈ వలసవాద చర్య ప్రాదేశిక విచ్ఛిన్నతను మరింత తీవ్రతరం చేయడానికి మరియు

పాలస్తీనా ప్రజలను ఒంటరిగా చేయడానికి బెదిరించే విస్తృత ప్రణాళికలో భాగమని అధికారులు హెచ్చరించారు. పాలస్తీనా ప్రజలపై కొనసాగుతున్న యుద్ధం చట్రంలో ఈ విధానాలు ప్రమాదకరమైన వ్యూహాన్ని కలిగి ఉన్నాయని పాలస్తీనా నేత నబిల్ అబు రుదెనెహ్ ఖండించారు. పాలస్తీనియన్ కమ్యూనిటీలను వేరు చేయడం, వేర్వేరు మార్గాలను వినియోగించాలని వారిపై ఒత్తిడి తీసుకురావడం మరియు ప్రధాన రవాణా మార్గాలను అడ్డుకోవడం ఈ రహదారి నిర్మాణం ప్రధాన లక్ష్యాలని పేర్కొన్నారు.

ఆదివారం
జూన్, 14 , 2026
నమస్తే భారత్
తెలుగు దినపత్రిక
NAMASTHE BHARAT TELUGU DAILY



# విద్యుత్ ప్రయివేటీకరణపై వెనక్కి

## - కార్మికుల పోరాటంతో దిగొచ్చిన పుదుచ్చేరి ప్రభుత్వం
## - ఇఇఎఫ్ఐ హర్షం



పుదుచ్చేరి : కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలోని ప్రభుత్వం విద్యుత్‌శాఖను 100 శాతం ప్రయివేటీకరించేందుకు 2022లో టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే కార్మికులు, ప్రజల పోరాటంతో దిగొచ్చిన ప్రభుత్వం తాజాగా ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేసింది. దీన్ని ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) స్వాగతించింది. ఈ మేరకు ఇఇఎఫ్ఐ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విద్యుత్ కార్మికులు, ట్రేడ్ యూనియన్లు, పుదుచ్చేరి ప్రజలు సాగించిన అలుపెరగని పోరాటానికి ఇది దక్కిన గొప్ప విజయమని పేర్కొంది.

ప్రయివేటీకరణపై ఆందోళన: పుదుచ్చేరి విద్యుత్ ప్రయివేటీకరణ వ్యతిరేక కమిటీ, ఇతర అనుబంధ సంస్థలు ఈ ఉద్యమాన్ని ముందుండి నడిపించాయి. 2022 నవంబరు 16న మద్రాస్ హైకోర్టు నుండి స్టే ఆర్డర్ పొందడం, విద్యుత్ ఉద్యోగుల సంఘాల నిరంతర నిరసనలు, రాజకీయ పార్టీల వ్యతిరేకత కారణంగా ప్రయివేటీకరణ ప్రక్రియ నిలిచిపోయింది. ముఖ్యంగా 2025 జులై 26న 'అదానీ ఎలక్ట్రిసిటీ బోర్డ్ పుదుచ్చేరి లిమిటెడ్' పేరుతో రిజిస్ట్రేషన్ చేయడంపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. దీనితో ప్రయివేటీకరణ జరగదని ప్రభుత్వం బహిరంగంగా హామీ ఇవ్వాల్సి వచ్చింది.ప్రభుత్వం ఈ టెండర్‌ను రద్దు చేసినప్పటికీ, 'టిఒటిఇఎక్స్' మోడల్ ద్వారా స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఇఇఎఫ్ఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. నాలుగు లక్షలకుపైగా ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ పంపిణీ సేవలను 'అప్రావా ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్'కు అప్పగించడం పరోక్షంగా ప్రయివేటీకరణ చేయడమేనని విమర్శించింది. మీటర్ రీడింగ్, బిల్లింగ్, వసూళ్ల వంటి కీలక విధులను ప్రయివేట్ సంస్థలకు అప్పగించడం వల్ల ప్రజల సంక్షేమం కంటే ప్రయివేట్ లాభాలకే ప్రాధాన్యత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్‌శాఖ ఎప్పటికీ ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, ఏ రూపంలోనూ ప్రయివేటీకరించకూడదని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్ల అమలు, అప్రావా ఎనర్జీకి ఇచ్చిన 'టిఒటిఇఎక్స్' మోడల్ కాంట్రాక్టును తక్షణమే రద్దు చేయాలని ఇఇఎఫ్ఐ డిమాండ్ చేసింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ రంగ విద్యుత్ సేవలను కాపాడటానికి తాము కట్టుబడి ఉన్నామని, పుదుచ్చేరిలో సాధించిన ఈ విజయం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఇలాంటి పోరాటాలకు స్ఫూర్తినిస్తుందని ప్రకటనలో పునరుద్ఘాటించింది.

# కోడ్ అడిగి.. కాల్స్ 'ఫార్వర్డ్' తో టోకరా వేసి..




న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్‌లో ఉండే కాల్ ఫార్వర్డింగ్ ఫీచర్ అమాయకులను దోచుకోవడానికి మోసగాళ్లకు ఉపయోగపడుతున్నది. ఇండియన్ సైబర్ క్రైమ్ కో-ఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) జారీ చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, మోసగాళ్లు సాధారణ ప్రజలకు ఫోన్ చేసి, తాము కొరియర్ లేదా డెలివరీ సర్వీస్ ఏజెంట్లుగా చెప్పుకుంటు న్నారు. ప్యాకేజీని కన్‌ఫర్మ్ చేయాలని,
లేదా రీషెడ్యూల్ చేయాలని సాకు చెప్తున్నారు. ఈ సంభాషణ సాధారణమైనదిగానే కనిపిస్తుంది. డెలివరీ విషయంలో ఓ చిన్న సమస్య వచ్చిందని, వివరాల ధ్రువీకరణ కోసం ఓ చిన్న కోడ్‌ను డయల్ చేయాలని చెప్తారు. ఈ కోడ్‌ను ఎస్ఎంఎస్ ద్వారా పంపిస్తారు. ఈ కోడ్‌కు ముందు 21, 61 లేదా 67 ఉంటాయి. ఈ కోడ్‌ను డయల్ చేసినవారి ఫోన్‌లో కాల్ ఫార్వర్డింగ్ ఆప్షన్ యాక్టివేట్ అవుతుంది. ఇన్ కమింగ్ కాల్స్‌ను ఆ మోసగాళ్ల నియంత్రణలో ఉన్న ఫోన్ నంబరుకు పంపిస్తుంది.

యూఎస్ఎస్‌డీ కాల్స్ దుర్వినియోగం: అన్‌స్ట్రక్చర్డ్ సప్లిమెంటరీ సర్వీస్ డేటా (యూఎస్ఎస్‌డీ) అనే టెలికాం ప్రోటోకాల్ వల్ల ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే నెట్‌వర్క్ సర్వీసులను యాక్సెస్ చేయవచ్చు. దీనిని ఈ కుంభకోణానికి మోసగాళ్లు ఉపయోగించుకుంటున్నారు. బ్యాంకుల నుంచి వచ్చే వెరిఫికేషన్ కాల్స్, చెల్లింపుల కోసం వచ్చే కన్ఫర్మేషన్ ఓటీపీలు, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి ప్లాట్‌ఫాంల నుంచి వచ్చే ఆథెంటికేషన్ మెసేజ్‌లు యూజర్లకు కాకుండా మోసగాళ్లకు చేరుతాయి. గుర్తు తెలియని కాలర్లు పంపించే యూఎస్ఎస్‌డీ కోడ్స్ ప్రారంభంలో 21. 61 లేదా 67 ఉంటే, ఆ కోడ్‌లను డయల్ చేయవద్దు. కాల్ ఫార్వర్డింగ్ యాక్టివేషన్‌లో ఉందని యూజర్లకు అనుమానం వస్తే, వెంటనే ఛఛ002ఛ కు డయల్ చేసి అన్ని ఫార్వర్డింగ్ సర్వీసులను డీయాక్టివేట్ చేయాలి. బాధితులు నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫోన్ చేయాలి.

# స్పైలుగా చిన్నారులు.. మారని పాకిస్తాన్ వైఖరి

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు ఎన్నిసార్లు బుద్ధి చెప్పినా తీరు మార్చుకోవడం లేదు. ఉగ్రవాద సంస్థలతోపాటు ఐఎస్ఐతో కుట్రలు చేస్తూనే ఉంది. తాజాగా ఐఎస్ఐ కుట్రను మన భద్రతా బలగాలు గుర్తించాయి. అయితే ఇందులో అభం శుభం తెలియని 15 ఏళ్ల పిల్లలు ఉండడం ఆందోళన కలిగిస్తోంది. పఠాన్‌కోట్‌లో 15 ఏళ్ల బాలుడిని పోలీసులు అరెస్టు చేశారు. సాధారణ జీవితం గడుపుతున్న అతను రక్షణ స్థావరాలు, భద్రతా సిబ్బంది ఫొటోలు తీసి సోషల్ మీడియాలో పంచాడు. ఈ ఘటన ఐఎస్ఐ ఆన్‌లైన్ గ్రూమింగ్ వ్యూహాన్ని బయటపెట్టింది.జమ్మూ సాంబార్ ప్రాంతం నుంచి పఠాన్‌కోట్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఈ అబ్బాయి వివిధ చోట్ల తిరిగి ఫొటోలు, వీడియోలు సేకరించాడు. రక్షణ శాఖ ఆఫీసులు, నివాసాలు, వాహనాలు లక్ష్యాలు. పోలీసు విచారణలో సోషల్ మీడియా గ్రూపుల్లో అజ్ఞాతుల సూచనలపై ఇలా చేశాడు. ఫొటోలు, వీడియోలను ఓ గ్రూపులో పోస్టు చేశాడు. బాలుడి తండ్రి చనిపోయి పేదరికంలో ఉన్నాడు. ఐఎస్ఐ ఏజెంట్లు డబ్బు పంపుతూ సమాచారం సేకరించారు.ఆన్‌లైన్ గ్రూమర్లు పిల్లలను ఆకర్షించి నేరాలకు ప్రేరేపిస్తారు. ఇలాంటి బాలురు ఐఎస్ఐకి మిలిటరీ కదలికలు, ఆయుధాల వివరాలు సరఫరా చేస్తున్నారు. పఠాన్‌కోట్ ఎయిర్ బేస్, సరిహద్దు రక్షణ వ్యవస్థలు కీలకం. 2016 జైష్ దాడి ఇక్కడే జరిగింది.అంబాలాలో ప్రైవేటు ఉద్యోగిని అరెస్టు చేశారు. మిలిటరీ పాస్‌తో లోపలికి వెళ్లి సరుకులు అందించే సందర్భంలో ఐఎస్ఐ హనీట్రాప్, బ్లాక్‌మెయిల్‌తో సమాచారం సేకరించింది. 15?16 ఏళ్ల పిల్లలను కూడా ఉపయోగిస్తున్నారు.ఈ ఘటనలు భద్రతా ఏజెన్సీలను హెచ్చరికలో ఉంచాయి. పిల్లల ద్వారా సమాచారం సేకరణ కొత్త ఆందోళన. రక్షణ స్థాపనల చుట్టూ పరిశీలనలు పెరిగాయి. పోలీసులు మైనర్‌పై చర్యలు తీసుకుంటూ గ్రూమర్లను గుర్తించాలని ప్రయత్నిస్తున్నారు. పిల్లలను లక్ష్యంగా చేసుకున్న ఈ వ్యూహం జాతీయ భద్రతకు సవాలు. తల్లిదండ్రులు, సమాజం ఆన్‌లైన్ కార్యకలాపాలపై అవగాహన పెంచుకోవాలి. భద్రతా దళాలు సోషల్ మీడియా మానిటరింగ్‌ను బలోపేతం చేయాలి.

# ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచొద్దు

## నియామకాలు చేపట్టాలంటున్న విద్యుత్ ఉద్యోగులు



అమరావతి : ఉద్యోగం 60 ఏళ్లకు చాలు, అంతకుమించి వయసు వద్దని విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కొత్త వారిని నియమించుకోవడం ద్వారా విద్యుత్ సంస్థలపై ఆర్థిక భారం, ప్రస్తుత ఉద్యోగులకు పనిభారం తగ్గుతుందని వారు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచింది. ఉద్యోగ విరమణ తరువాత వారికివ్వాల్సిన ఆర్థిక బకాయిల నుంచి ప్రభుత్వం తప్పించుకునేందుకు వయసు పెంచిందని ఇప్పటికే ఉద్యోగులు భావిస్తున్నారు. విద్యుత్ కార్పొరేషన్లలోనూ ఇలానే అమలు చేసి ఆర్థిక భారం నుంచి తప్పించుకోవాలని చూస్తోంది. అందులో భాగంగానే వీరికి కూడా ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికోసం మంత్రివర్గ ఉపసంఘాన్నీ ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం ఇప్పటికే పలుమార్లు సమావేశమైంది. అయితే 62 ఏళ్ల ఉద్యోగ విరమణ తమకొద్దని విద్యుత్ సంస్థల్లోని ఉద్యోగులు విద్యుత్ సంస్థల యాజమాన్యాలకు, రాష్ట్ర ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సంస్థల ఉద్యోగులపై పనిభారం ఎక్కువగా ఉంటుంది. 24 గంటలు అందుబాటులో ఉండాలి. వీళ్ల పని ఎప్పుడూ ప్రమాదంతో కూడుకున్నది. ఇతర శాఖలతో పోలిస్తే శారీరకంగా కఠినమైన పనులు చేయాల్సి ఉంటుంది. విద్యుదుత్పత్తి కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులు బాయిలర్ నిర్వహణ, ఇతర కీలక పనులు చేయాలి. ట్రాన్స్‌కోలో చేసేవారు లైన్ల నిర్వహణ వంటి పనులు, డిస్కమ్‌లలో పనిచేసే ఉద్యోగులు తుపానులు వంటి విపత్కర పరిస్థితుల్లోనూ పోల్స్ వంటివి ఎక్కి పనిచేయాల్సిందే. ఏళ్ల తరబడి పనిచేయడం వల్ల ఇలాంటి పనులు 60 ఏళ్లు దాటిన తరువాత కూడా చేసేందుకు శరీరం సహకరించదు. రానున్న రెండేళ్లలో ఉద్యోగ విరమణకు అర్హులైన ఉద్యోగుల్లో 90 శాతం ఇలాంటి పనులు చేసేవారే ఉన్నారని, కావున ఉద్యోగ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచొద్దని వారు కోరుతున్నారు. ఈ విషయమై ఎపిఎస్ఇబి ఇఇ అసోసియేషన్, ఎపిఎస్ఇబి ఎఇఇ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పలుమార్లు లేఖలు రాశాయి.

పెరుగుతోన్న పనిభారం: విద్యుత్ సంస్థల్లో సుమారు ఏడేళ్ల నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (ఎఇఇ) నియామకాలు లేవు. మొత్తం 7,500 మంజూరైన పోస్టులుంటే ప్రస్తుతం సుమారు 5,800 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. సుమారు 1,700 పోస్టుల వరకు ఖాళీలు ఉన్నాయి. ఈ పోస్టులను భర్తీ చేయాలని ఇప్పటికే ఉద్యోగ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వానికి, విద్యుత్ సంస్థల యాజమాన్యాలను కోరుతున్నాయి. నియామకానికి సంబంధించిన ఫైల్ ఇంధనశాఖ నుంచి ముఖ్యమంత్రి వద్దకు వెళ్లింది. ముఖ్యమంత్రి అనుమతి రాగానే నియామక ప్రక్రియ చేపడతామని ఇంధనశాఖ.. సంఘాలకు తెలిపింది. సుమారు ఏడాది నుంచి ఇదే మాట చెబుతున్నారని, నియామకం మాత్రం చేపట్టడం లేదని, మరోపక్క పనిభారం పెరుగుతోందని సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి.

# స్థలంలో ఇళ్లు కట్టకపోతే తిరిగి ఇచ్చేయండి

## గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ..

నెల్లూరు : ఏపీలో వారందరికీ బ్యాడ్ న్యూస్.. డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని ఏపీ గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. ఇంటి పట్టాలు పొందిన తర్వాత అందులో ఇంటి నిర్మాణాలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఇందుకోసం ప్రభుత్వం లబ్ధిదారులకు అడ్వాన్సులు కూడా అందించింది. అయితే అడ్వాన్స్ పొందిన తర్వాత కూడా కొంతమంది లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు ప్రారంభించలేదు. ఈ నేపథ్యంలో అలాంటి వారికి ఏపీ గృహ నిర్మాణ సంస్థ నోటీసులు జారీ చేస్తోంది. ఇంటి పనులు ప్రారంభించాలని.. కుదరకపోతే డబ్బులు వెనక్కి ఇచ్చేయాలని నోటీసులు ఇస్తోంది.ఏపీలో ఇంటి నిర్మాణాల కోసం ఇళ్ల పట్టాలు పొంది.. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి అడ్వాన్సులు పొందిన లబ్ధిదారులకు అధికారులు షాక్ ఇస్తున్నారు. వీలైతే ఇంటి నిర్మాణం చేపట్టాలని.. లేకపోతే ప్రభుత్వం అందించిన అడ్వాన్స్ నగదు తిరిగి చెల్లించాలని గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు ఇస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో పేదలకు ఇంటి నిర్మాణం కోసం పట్టాలు పంపిణీ చేశారు. పంపిణీ చేసిన స్థలాలలో వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఇందుకోసం ప్రజలకు ఒక్కో ఇంటికి రూ.10 వేలు నుంచి రూ.20 వేలు వరకూ అడ్వాన్స్ రూపంలో అందించారు. నిర్మాణాలు చేపట్టలేదు. స్థలం నచ్చకో లేదా ప్రభుత్వ సాయం తక్కువగా ఉందనే కారణంతోనో తెలియదు కానీ.. కొన్నిచోట్ల ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేదు.మరోవైపు ప్రస్తుత ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం ఎస్సీ, బీసీ సామాజికవర్గాల లబ్ధిదారులకు అదనపు సాయం రూపంలో రూ.50 వేలు చెల్లిస్తోంది. అలాగే ఎస్టీ సామాజికవర్గాల వారికి రూ.75 వేలు చొప్పున అందిస్తున్నారు. ఈ సాయం పొందిన తర్వాత కొంత మంది ఇంటి నిర్మాణాలు ప్రారంభి ంచగా.. మరికొందరు మాత్రం ఎలాంటి నిర్మాణాలు చేపట్టడం లేదు. ఈనేపథ్యంలో అలాంటి వారిలో కదలిక తెచ్చేందుకు.. అలాంటి వారికి ఏపీ గృహ నిర్మాణ సంస్థ అధికారులు నోటీసులు జారీ చేస్తు న్నారు. ఇంటి నిర్మాణం ప్రారంభించాలని.. అలా వీలు కాకపోతే ప్రభుత్వం అందించిన అడ్వా న్స్ తిరిగి చెల్లించాలని నోటీసులు ఇస్తున్న పరిస్థితి. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఇంటి నిర్మాణాలు ప్రారంభించి.. ఆ తర్వాత వాటిని నిలిపివేసిన కుటుంబాలకు.. తిరిగి ఇల్లు కట్టుకునేందు కు ఏపీ ప్రభుత్వం అడ్వాన్సులు అందించింది. కేంద్ర ప్రభుత్వ పథక మైన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద అలాంటి వారికి అడ్వాన్సు లు అందించారు. అయినప్పటికీ కొంతమంది పనులు ప్రారంభించ కపోవటంతో ఏపీగృహ నిర్మాణ సంస్థ అధికారులు ఈ చర్యలు తీసుకుంటున్నారు. పేదలకు పక్కా ఇళ్లు ఉండాలనేది ప్రభుత్వం ఉద్దేశమన్న గృహ నిర్మాణ సంస్థ అధికారులు.. నోటీసులు ఇస్తున్నామన్నారు. నోటీసులు అందజేసి పనులు చేపట్టాలని సూచిస్తున్నట్లు గృహ నిర్మాణ సంస్థ అధికారులు చెప్తున్నారు. ఒక వేళ.. అప్పటికీ ఇంటి నిర్మాణానికి ముందుకు రాకపోతే అలాంటి వారి నుంచి అడ్వాన్స్ నగదు రికవరీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు

# మండలి ఛైర్మన్ పై అవిశ్వాసం..?

అమరావతి : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి అతిపెద్ద షాక్ తప్పదా? శాసనమండలి కూటమి హస్తగతం కానుందా? మండలి ఛైర్మన్ పై వేటు తప్పదా? కోర్టులో ప్రతికూల తీర్పు రాబోతుందా? ఛైర్మన్ పై కూటమి అవిశ్వాస తీర్మానం పెట్టనుందా? అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పెద్ద నష్టం తప్పదా? ఇప్పుడు పొలిటికల్ సర్కిల్లో ఇదే చర్చ నడుస్తోంది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి శాసనమండలిలో




స్పష్టమైన బలం ఉంది. అయితే చాలామంది ఎమ్మెల్సీలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కానీ ఇప్పటికే రాజీనామా చేసిన వారికి ఆమోదం లభించలేదు. ఛైర్మన్ మోసేన్ రాజు పెండింగ్లో పెట్టారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు.. ఛైర్మన్ ఫార్మేట్లో రాజీనామా లేఖలు పంపించినా ఆమోదానికి మాత్రం నోచుకోలేదు. ఛైర్మన్ మోసేన్ రాజు ఉద్దేశపూర్వకంగానే వాటిని తొక్కి పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అందుకే ఎమ్మెల్సీల రాజీనామా విషయంలో కూటమి వ్యూహం మార్చినట్లు తెలుస్తోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దారుణ పరాజయం చవిచూసింది. దీంతో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలుపోతుల సునీత, కర్రీ పద్మశ్రీ, బల్లి కళ్యాణ్ చక్రవర్తి, జయ మంగళం వెంకటరమణ, మర్రి రాజశేఖర్, జాకీయ ఖానం తదితర ఎమ్మెల్సీలు రాజీనామా చేశారు. మరికొందరు రాజీనామా చేసేందుకు
సిద్ధంగా ఉన్నారు. కానీ మండలి ఛైర్మన్ మోసేన్ రాజు రాజీనామాలకు ఆమోదం తెలపడం లేదు. అలా ఆమోదం తెలిపిన మరుక్షణం వారి రాజీనామాలు అమల్లోకి వస్తాయి. మళ్లీ ఎన్నికలు జరిగి ఆ ఎమ్మెల్సీ స్థానాలు కూటమి ఖాతాల్లో పడతాయి. అదే జరిగితే వైయస్సార్ కాంగ్రెస్
పార్టీ బలం తగ్గి కూటమి బలం పెరుగుతుంది. అందుకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హై కమాండ్ ఆదేశాలతోనే ఛైర్మన్ మోసేన్ రాజు అలా వ్యవహరిస్తున్నట్లు ప్రచారంలో ఉంది.అయితే ఇటీవల జనసేనలో చేరిన ఎమ్మెల్సీ జయ మంగళం వెంకటరమణకోర్టును ఆశ్రయించారు.

# ఆ ఐదుగురు ఎవరు..?

హైదరాబాద్: తెలంగాణ క్యాబినెట్లో..ఇప్పుడు ఒకటే చర్చ. అమాత్యులపై ఆరోపణలు..వివాదాలతో..ఎవరి సీటుకు ఎసరు వస్తుందనేది హాట్ టాపిక్ అవుతోంది. ఇప్పటిదాకా ఖాళీగా ఉన్న రెండు బెర్తులపైనే ఆశలు పెట్టుకున్న ఎమ్మెల్యేలకు..ఇప్పుడు ఖాళీ కాబోయే బెర్తులూ కూడా ఊరిస్తున్నాయట. దక్షిణ తెలంగాణకు చెందిన సీనియర్ మంత్రి ఓ మహిళా అధికారితో నడిపిన..నడుపుతున్న వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఎక్కడ చూసినా ఆ మంత్రెవరు..? ఆ అధికారెవరన్న చర్చే. ఆయన తెరచాటు వ్యవహారాలు..సర్కార్‌కు బ్యాడ్ నేమ్ తెచ్చిపెడుతున్నాయట.

సదరు మంత్రి కారణంగా ఇద్దరు మహిళా అధికారుల బదిలీలు కూడా జరిగాయటపార్టీలో అందరికన్నా తానే సీనియర్ అని చెప్పుకునే ఆ సదరు అమాత్యుల వారికి సంబంధించిన పూర్తి డేటా..ఇంటలిజెన్స్ రిపోర్టు ఢిల్లీకి కూడా చేరిపోయిందట. దీంతో గత అసెంబ్లీ సమావేశాల్లో ఒంటికాలిపై లేచిన ఆ అమాత్యుడు..ఈ సెషన్‌లో పూర్తిగా సైలెంట్ అయిపోయారట.


ఈ నేపథ్యంలోనే ఆయన కుర్చీకి ఎసరు తప్పదనే ప్రచారం జరుగుతోంది.ఇక దక్షిణ తెలంగాణకే చెందిన మరో సీనియర్ మంత్రిది ఇదే పరిస్థితి అంటున్నారు. ఎన్నికల ముందే హస్తం గూటికి చేరి..ఇప్పుడు అమాత్యులుగా ఉన్న ఆ మంత్రిగారికి కూడా ఉద్వాసన తప్పదంటున్నారు. ఆర్టీఐ ద్వారా తన శాఖలోని అధికారుల దందాలను ఆ మంత్రే బయట పెట్టడమే కారణమనే టాక్ నడుస్తోంది. వీరిద్దరూ తెలంగాణ ఉద్యమానికి తామే బ్రాండ్ అంబాసిడర్లం అని కూడా చెప్పుకునే నేతలే కావడం మరో విశేషం.ఇక మరో ఉత్తర తెలంగాణ మంత్రిది ఇంకో కథ. హైదరాబాద్‌లో అంతా తానై చక్రం తిప్పుతున్న సదరు మంత్రి చేష్టలు..సర్కార్‌కు హెడెక్‌గా మారాయట. మహిళా అధికారులు, నేతలతో జోక్‌లు..వింత పలుకులతో ఆయన తీరు చర్చనీయాంశంగా మారిందంటున్నారు.

సదరు మంత్రి తీరుపై ఇప్పటికే కొందరు అధికారులు..సీఎంవో దృష్టికి తీసుకెళ్లారట. ఇది చాలదన్నట్లు..ఇటీవల ఒకరిద్దరు మహిళా జర్నలిస్ట్‌లతో కూడా ఆయన సన్నిహితంగా ఉంటూ..వాట్సప్ కాల్స్..ఇన్‌స్టాలో మెస్సేజ్‌లు పెడుతూ టీనేజర్‌గా మారిపోయారన్న గుసగుసలు విన్పిస్తున్నాయి. ఈ వ్యవహారంతో సదరు అమాత్యుల వారికి ఉద్వాసన తప్పదన్న గుసగుసలు సెక్రటేరియట్లో రచ్చ రంబోలా చేస్తున్నాయి. ఇంకో సీనియర్ మంత్రిపై కూడా?చిలిపి చేష్టలు, కరప్షన్ అలిగేషన్స్‌తో గందరగోళం నెలకొందట. సమైఖ్య రాష్ట్రంలోనే.. సీనియర్ మోస్ట్ నేతగా ఉన్న ఆయనకు ఓ టైప్ ఆఫ్ డ్యాషింగ్ లీడర్‌గా పేరుంది. ఈ సదరు మంత్రితో సూటిగా మాట్లాడాలంటే.. అధికారులే కాదు..తోటి లీడర్స్ కూడా జంకుతుంటారు. తన అనుకున్న వారిపై ట్రాన్స్‌ఫర్స్ గాలి సోకకుండా.. ప్రొటెక్టర్‌గా ఉంటుంటడం వెనుక ఏవో మతలబులున్నాయనే టాక్ నడుస్తోంది. అవినీతి ఆరోపణలు పెరిగిపోవడంతో ఆయనపై కూడా రిపోర్టులు రెడీ అయ్యాయని తెలుస్తోంది.ఉత్తర తెంగాణకు చెందిన మరో సీనియర్ మహిళా మంత్రి పదవి కూడా..క్యాబినెట్ విస్తరణలో గల్లంతు అవడం పక్కా అంటున్నారు. సర్కార్ ఏర్పడిన కొత్తలో ఈ సీనియర్ మంత్రి నోటి మాటతో రేవంత్ సర్కార్‌కు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడగా..తన ఇంటి మనిషి అవినీతి వ్యవహారాన్ని వెనుకేసుకుని రావడం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.

అది ఇప్పటికీ విపక్షాలకు అస్త్రంగా ఉంటూనే వస్తోంది. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని ఆ మహిళా మంత్రిని క్యాబినెట్ నుంచి తప్పిస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీంతో సదరు మహిళా మంత్రికి విస్తరణ మాట వింటే చాలు కంటి మీద కునుకు రావడం లేదట.ఐదుగురు మంత్రులకు ఉద్వాసన పలికితే..అప్పుడు కేబినెట్ లో ఖాళీ బెర్తుల సంఖ్య ఆరుకు చేరనుంది.

అటు అజారుద్దీన్ స్థానం కూడా ఊగిసలాటలోనే ఉండటంతో కేబినెట్ లో బెర్తుల కోసం దాదాపు డజన్ మంది కాపు కాసుకుని కూర్చున్నారట. ఇప్పటికే ఈ లిస్ట్‌లో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, ఆది శ్రీనివాస్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరితో పాటు తొలిసారి ఎన్నికై అసెంబ్లీ లోపలా, బయట.. ఫైర్ బ్రాండ్ లీడర్లుగా ఎస్టాబ్లిష్ అవుతున్న మరికొందరు యువ ఎమ్మెల్యేలకు కూడా అదృష్టం కలిసి రావచ్చని టాక్ నడుస్తోంది.

# అభిమానుల్లో భారీ హైప్..!




పాన్ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా .. సెన్సేషనల్ దర్శకుడు సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా 'స్పిరిట్' పై దేశవ్యాప్తంగా అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. 'అర్జున్ రెడ్డి', 'కబీర్ సింగ్', 'యానిమల్' లాంటి సెన్సేషనల్ సినిమాల తర్వాత సందీప్ రెడ్డి వంగా, ఇప్పుడు ప్రభాస్‌తో మాస్ ఎమోషనల్ పోలీస్ డ్రామా చేయబోతుండటంతో అభిమానుల్లో భారీ హైప్ నెలకొంది. భద్రకాళి పిక్చర్స్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ప్రీ-ప్రొడక్షన్ పనులు దాదాపు పూర్తి కాగా, షూటింగ్ త్వరలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాను 2026లో ప్రపం చవ్యాప్తంగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ గురువారం రాత్రి 11 గంటలకు 'ది సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిల్మ్ స్పిరిట్' అనే 1 నిమిషం 31 సెకండ్ల గ్లింప్స్‌నువిడుదల చేశారు. ఈ వీడియోను తెలుగు, హిందీ, తమిళ్, కన్నడ,మలయాళ భాషల్లో రిలీజ్ చేశారు. సౌండ్ థీమ్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసిన సందీప్ వంగా మార్క్ స్టైల్ గ్లింప్స్‌లో బలంగా కనిపించింది. ఐపీఎస్ ఆఫీసర్‌గా ఉన్న ప్రభాస్‌అరెస్ట్ అయ్యే సన్నివేశాలను కేవలం ఆడియో రూపంలో చూపించడం ఆసక్తికరంగా మారింది. ఇందులో ప్రకాశ్ రాజ్ వాయిస్‌తో.."వీడి గురించి విన్నాను యూనిఫాం ఉన్నా లేకపోయినా బిహేవియర్‌లో తేడా ఉండదు.. చూద్దాం ఈ ఖైదీ యూనిఫాంలో ఎలా ఉంటాడో!" అనేది వంగా రైటింగ్ శైలిని గుర్తు చేసింది. ఇక చివర్లో ప్రభాస్ చెప్పిన.. "మిస్టర్ సూపరింటెండెంట్.. నాకు చిన్నప్పటి నుంచి ఒక బ్యాడ్ హ్యాబిట్ ఉంది" అనే డైలాగ్ గ్లింప్స్ మొత్తానికే హైలైట్‌గా నిలి చింది. ఆ ఒక్క లైన్‌తోనే ఆయన పాత్ర ఇంటెన్స్‌గా, రఫ్‌గా ఉండబో తుందనేది స్పష్టమవుతోంది. సినిమా సౌండ్ డిజైన్‌పై మాట్లాడిన సందీప్ వంగా, "సాధారణంగా సినిమాకు బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్‌ను చివర్లో జత చేస్తారు. కానీ 'స్పిరిట్'లో మేము ముందే 70 శాతం సౌండ్‌ట్రాక్‌ను సిద్ధం చేశాం. ఆ సౌండ్ ఆధారంగా షాట్లుప్లాన్ చేస్తున్నాం," అని చెప్పారు. ఇది భారతీయ సినీ చరిత్రలో అరుదైన ప్రయోగమని ఇండస్ట్రీ వర్గాలు పేర్కొంటున్నా యి. ఈ సినిమాలో ప్రభాస్‌తో పాటు వివేక్ ఒబెరాయ్, త్రిప్తి దిమ్రీ, ప్రకాశ్ రాజ్, కాంచన వంటి ప్రముఖనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ సెట్‌లు, టాప్‌టెక్నికల్ టీమ్, అత్యాధునిక యాక్షన్ సీక్వెన్సెస్‌తో సినిమా నిర్మాణం జరుగనుంది. ప్రస్తుతం ప్రభాస్ 'ది రాజా సాబ్', 'ఫౌజీ' సినిమాలతో బిజీగా ఉన్నారు. వీటితోపాటు త్వరలోనే 'స్పిరిట్' షూటింగ్‌లో పాల్గొననున్నారు. సందీప్ వంగా ఈ ప్రాజెక్ట్‌ను సింగిల్ షెడ్యూల్‌లో పూర్తి చేయాలని భావిస్తున్నాడు. ఇక తర్వాత ప్రభాస్ లైనప్‌లో 'కల్కి 2898 AD 2', 'సలార్ 2' వంటి పెద్ద ప్రాజెక్ట్‌లు ఉన్నాయి.

# గ్లామర్ తో హీటెక్కిస్తున్న రకుల్..



హీరోయిన్స్ ఒకవైపు సినిమాలలో నటిస్తూనే.. మరొకవైపు సోషల్ మీడియాలో తమ అందంతో ఫాలోవర్స్ ను పెంచుకుంటున్నారు. అంతేకాదు ఫాలోవర్స్ లో పెంచుకున్న తర్వాత పలు ఉత్పత్తులను ప్రమోట్ చేస్తూ అలా కూడా ఆదాయాన్ని పొందుతున్న విషయం తెలిసిందే. ఇకపోతే ఫాలోవర్స్ పెరగాలంటే రోజుకు ఒక గ్లామర్ ట్రీట్ ఇవ్వాల్సిందే అనే రేంజ్ లో ప్రస్తుతం ట్రెండ్ నడుస్తోంది అంటూ నెటిజన్లు కూడా కామెంట్లు చేస్తూ ఉంటారు. మరోవైపు ఈ మధ్యకాలంలో హీరోయిన్స్ సినిమా షూటింగ్ లతో బిజీగా ఉన్నప్పటికీ.. మరోవైపు అభిమానులకు చేరువ అవ్వడానికి నిత్యం ఫోటోషూట్ తో ఆకట్టుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా రకుల్ ప్రీత్ సింగ్ కూడా తన గ్లామర్ తో ఆకట్టుకునే ప్రయత్నం చేసింది. బ్లాక్ కలర్ లెహంగా ధరించిన ఈమె.. దీనికి కాంబినేషన్ లో సిల్వర్ కలర్ హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన ఒక కోట్ ధరించి.. తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. ముఖ్యంగా గార్జియస్ లుక్ లో అదిరిపోయే స్టిల్స్ ఇచ్చి మరింత అందంగా కనిపిస్తోంది ఈ ముద్దుగుమ్మ. తన మెడను ప్రత్యేకంగా డిజైన్ చేసిన జువెలరీ తో ఫుల్ ఫిల్ చేసుకుంది. ఇక మత్తెక్కించే కళ్ళతో.. మరింత అందంగా ముస్తాబయింది. తాజాగా ఓవర్ లోడెడ్ గ్లామర్ డోస్ తో అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసింది . అదిరిపోయే ఫోజులు ఇవ్వడంతో ఆ ఫోజులకే ఫిదా అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. మొత్తానికైతే రకుల్ షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. రకుల్ ప్రీత్ సింగ్ విషయానికి వస్తే.. కెరటం అనే సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ సినిమాతో మరింత పాపులారిటీ దక్కించుకుంది. "ప్రార్థన ప్రతి రూపాయి కౌంటింగ్ ఇక్కడ" అనే డైలాగ్ తో ఊహించని క్రేజ్ సొంతం చేసుకుంది. రకుల్ ప్రీత్ సింగ్ ఈ సినిమా తర్వాత లౌక్యం, కరెంటు తీగ, కిక్ 2 , పండగ చేసుకో, బ్రూస్ లీ, నాన్నకు ప్రేమతో,సరైనోడు, ధ్రువ, రారండోయ్ వేడుక చూద్దాం, జయ జానకి నాయక , స్పైడర్ ఇలా పలు తెలుగు చిత్రాలలో పలువురు స్టార్ హీరోల సరసన నటించి భారీ పాపులారిటీ అందు కుంది. ఇక తెలుగులో నాగార్జున సరసన మన్మధుడు 2 సినిమాలో నటించి విమర్శలు ఎదుర్కొన్న ఈమె.. ఆ తర్వాత చెక్ సినిమాలో నటించి డిజాస్టర్ ను మూటగట్టుకుంది. ఇక ఆ తర్వాత ఈమె నటించిన ఎన్నో సినిమాలు ఈమెకు పెద్దగా విజయాన్ని అందించలేదు.

# మళ్లీ సినిమాలు చేస్తా: ఇలియానా..




గోవా బ్యూటీ ఇలియానా గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దేవదాసు సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన ఈ నటి ఆ తర్వాత రాఖీ, పోకిరి, జల్సా వంటి సూపర్‌హిట్‌లను అందుకోవడమే కాకుండా స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది.

ఒకప్పుడు స్టార్ నటిగా రూల్ చేసిన ఈ భామ ప్రస్తుతం సినిమాలు మానేసి ఫ్యామిలీతో సమయం గడుపుతున్న విషయం తెలిసిందే. 2023లో మైఖేల్ డోలన్ అనే వ్యక్తిని వివాహం చేసుకున్న ఇలియానా ఇద్దరు బిడ్డలకు జన్మనిచ్చింది. అయితే గత కొన్ని రోజులుగా ఫ్యామిలీతోనే గడుపుతున్న ఈ భామ.. తాజాగా మళ్లీ సినిమాలు చేయబోతున్నట్లు ప్రకటించింది. ఈ ప్రస్తుతం తాను తన ఇద్దరు కొడుకుల సంరక్షణలో బిజీగా ఉన్నానని, అందుకే సినిమాలకు విరామం తీసుకున్నానని ఇలియానా చెప్పింది. అలాగే అభిమానులు నన్ను ఎంతగా మిస్ అవుతున్నారో నాకు తెలుసు. నటన అంటే నాకెంతో ఇష్టం. తెరపై కనిపించడం, విభిన్నమైన పాత్రలు పోషించడం, సెట్‌లో ఉండే సందడి ఇవన్నీ నాకు చాలా ఇష్టం.నా కెరీర్‌లో ఎంతోమంది గొప్ప వారితో కలిసి పనిచేసే అవకాశం రావడం నా అదృష్టం అని ఇలియానా అన్నారు.

అయితే పిల్లల బాధ్యతకు తాను మొదటి ప్రాధాన్యం ఇస్తున్నానని, అందుకే కొద్ది రోజులు ఆగి మళ్లీ వస్తానని ఆమె తెలిపారు. తిరిగి వచ్చే ముందు మానసికంగా, శారీరకంగా సిద్ధం కావడానికి కొంత సమయం పడుతుంది. ఏ పని చేసినా దానికి పూర్తిగా న్యాయం చేయాలనుకుంటాను అని ఆమె ఇలియానా తెలిపారు.

# 'రామాయణ'లో కాజల్ అగర్వాల్ పాత్రపై అందరిలో ఆసక్తి




టాలీవుడ్‌లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన కాజల్ అగర్వాల్, వివాహం అనంతరం సినిమాల ఎంపికలో మార్పులు చేస్తూ, ఇప్పుడు మరింత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లలో భాగమవుతున్నారు. ఇటీవల భగవంత్ కేసరి, కన్నప్ప వంటి చిత్రాల్లో నటించిన ఆమె, ఇప్పుడు భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత భారీ ప్రాజెక్ట్‌గా రూపొందుతున్న రామాయణ సినిమాలో భాగమవుతున్నట్లు ప్రకటించారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రాన్ని బాలీవుడ్ దర్శకుడు నితీష్ తివారి తెరకెక్కిస్తున్నారు. పురాణ గాథ ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో కనిపించనున్నారు. గత కొంతకాలంగా ఆమె రావణాసురుడి భార్య మండోదరి పాత్రలో నటిస్తున్నారని వస్తున్న వార్తలను తాజాగా ఆమె స్వయంగా ధృవీకరించారు. రీసెంట్‌గా సోషల్ మీడియా వేదికగా కాజల్ అగర్వాల్ 'రామాయణం' గ్లింప్స్‌ను షేర్ చేస్తూ తన ఆనందాన్ని వ్యక్తం చేశారు. "ప్రతి తరం శ్రీరాముడి పేరుతోనే పెరిగింది. ఇప్పుడు యావత్ ప్రపంచం మర్యాద పురుషోత్తముడైన ఆ రాముడిని దర్శించుకోనుంది. ఇలాంటి గొప్ప సినిమాలో భాగమవడం నాకు గర్వంగా ఉంది" అంటూ ఆమె రాసుకొచ్చారు. ఈ సినిమాలో స్టార్ క్యాస్టింగ్ కూడా ప్రేక్షకుల్లో భారీ అంచనాలు పెంచుతోంది. రణబీర్ కపూర్ శ్రీరాముడిగా, సాయి పల్లవి సీతగా నటిస్తున్నారు. అలాగే సన్నీ డియోల్ హనుమంతుడి పాత్రలో, యష్ రావణాసురుడిగా కనిపించనున్నారు. ఈ భారీ చిత్రాన్ని నిర్మాత నమిత్ మల్హోత్రా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్‌కు మంచి స్పందన లభించింది. 'రామాయణం' చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. మొదటి భాగాన్ని ఈ ఏడాది దీపావళి సందర్భంగా విడుదల చేయనుండగా, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళికి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. ఏది ఏమైన, కాజల్ అగర్వాల్ మండోదరి పాత్రలో కనిపించనున్న వార్త అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచింది. ఆమె నటనపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం కాజల్ షేర్ చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# కొరియన్ భాషలో కూడా నటించాలనుందట..!

## హాట్ టాపిక్‌గా రష్మిక మందన్నా కామెంట్స్



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వచ్చిన చిత్రం థామా. హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 21న విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. మరోవైపు ఇటీవలే తెలుగులో ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్న రష్మిక ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకుంది. తన ఫిల్మోగ్రఫీలో భిన్నమైన సినిమాలుండేలా ప్లాన్ చేసుకునే రష్మిక కొరియన్ సినిమా చేయడంపై అడిగిన ప్రశ్నకు స్పందించింది. అవును.. కొరియన్ డ్రామా చేయాలనుకుంటున్నా. అవి చాలా ఫన్‌గా ఉంటాయి. కానీ వాళ్లు (మేకర్స్) నాకు ఏం ఇస్తున్నారనే దానిపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే నేను స్క్రీన్‌పై ఏం చేయగలనో మీకు తెలుసు..

కథ నాకు సెట్ అవుతుందనిపిస్తే కొరియన్ ప్రాజెక్ట్ చేసేందుకు రెడీనంటూ చెప్పుకొచ్చింది. నాకు కొరియన్ సినిమాలపై ప్రేమ కోవిడ్‌టైంలోనే మొదలైంది. కోవిడ్ సమయంలో నా చేతిలో చాలా టైం ఉంది కాబట్టి కొరియన్ డ్రామాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రతీ కొరియన్ డ్రామా 16 ఎపిసోడ్స్‌గా ఉంటుంది. అంటే మీరు ఒక కొరియన్ ప్రాజెక్ట్‌ను స్క్రీన్‌పై చూడాలంటే రోజులో 16 గంటలు కేటాయించవచ్చున్నది రష్మిక మందన్నా. ఈ కామెంట్స్‌తో ఇక రాబోయే కాలంలో కొరియన్ సినిమాలు కూడా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని రష్మిక హింట్ ఇచ్చేస్తుంది.

# మగవాళ్లకు ఒక రూల్.. ఆడవాళ్లకు ఒక రూలా?"



ప్రముఖ సినీ నటుడు మంచు మోహన్ బాబు తనయగా కాకుండా, నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న మంచు లక్ష్మి ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ఇటీవల 'ఆదిపర్వం', 'దక్ష' చిత్రాలతో అలరించిన ఆమె, మార్చి చివరి వారంలో 'లేచింది మహిళా లోకం' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. తాజాగా ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె, మన సమాజం మహిళలను చూసే దృక్పథంపై నిప్పులు చెరిగారు. సమాజం మహిళలను జడ్జ్ చేసే విధానాన్ని లక్ష్మి తప్పుబట్టారు. "మగవాళ్లు ఏదైనా బోల్డ్ నిర్ణయాలు తీసుకుంటే అది గొప్ప అని ప్రశంసిస్తారు. అదే ఆడవాళ్లు చేస్తే మాత్రం రకరకాలుగా మాట్లాడుకుంటారు. 'మేము చేస్తే సంసారం.. మీరు చేస్తే ఆ వ్యవహారం' అనే విధంగా ఉంటుంది. ఆ సామెతను నా నోటితో పూర్తిగా చెప్పను కానీ, మీకు అర్థమైందని అనుకుంటున్నాను" అని ఆమె చమత్కరిస్తూనే గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆడవాళ్లు ఇలాగే ఉండాలి, ఇలాగే ప్రవర్తించాలి అని రూల్స్ రాసింది ఎవరని ఆమె ప్రశ్నించారు.

Printed by Published by KANDADI MAHENDER REDDY on behalf of KANDADI MAHENDER REDDY,
Printed at and Published at Flat no.101, Ushodaya Towers, IDA Jeedimetla, Quthbullapur editor KANDADI MAHENDER REDDY.